RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

ఎడిటర్ : బూర్ల వెంకన్న కరీంనగర్ సంపుటి :17 సంచిక :314 బుధవారం , మార్చి 11, 2026, పేజీలు -20 వెల :5/-

## హైదరాబాద్ చేరుకున్న కొత్త గవర్నర్

### శివ ప్రతాప్ శుక్లాను స్వాగతించిన సిఎం

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** తెలంగాణకు కొత్తగా నియమితులైన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సిఎం రేవంత్ తదితరులున గవర్నర్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికి వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా లోక్‌భవన్ చేరుకున్నారు.



## మూడేళ్లలో పంచాయితీలకు శాశ్వత భవనాలు

### వివిధ శాఖల అధికారులతో డిప్యూటి సిఎం భట్టి సమీక్ష

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్‌ను పురస్కరించుకుని మంగళవారం వివిధ శాఖల అధికారులు, మంత్రుల తో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారుల తో సమావేశమై, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరు పై సమీక్షించారు. 'తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

- మిగతా2లో




## ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరల మోత

### గ్యాస్ ధరలు పెరగడంతో పెట్రో ధరల పై ఆందోళన

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మన దేశ నిత్యావసరాల పై తీవ్ర ప్రభావం చూపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు ఆటంకం ఏర్పడడంతో, అతి త్వరలో నే వీటి నిల్వలు నిండుకుంటాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సంర్భంలో గ్యాస్

- మిగతా2లో



## న్యాయవ్యవస్థ అవినీతి పాఠ్యాంశం తొలగించాం

### సుప్రీం కోర్టుకు ఎన్‌సిఇఆర్‌టి బహిరంగ క్షమాపణలు

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** 8వ తరగతి సోషల్ పాఠ్యపుస్తకంలో వివాదాస్పద అధ్యాయం పై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం సుప్రీంకోర్టుకి బహిరంగ క్షమాపణలు తెలిపింది. న్యాయవ్యవస్థలో 'అవినీతి' గురించి పాఠ్యపుస్తకంలో ప్రస్తావించడం పై సుప్రీంకోర్టు రెండు వారాల క్రితం ఎన్‌సిఇఆర్‌టిని

- మిగతా2లో



## దేశీయంగా 10శాతం ఎల్పిజి ఉత్పత్తి పెంపు

### కేంద్రమంత్రులతో ప్రధాని మోడీ అత్యవసర భేటీ

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పెరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర పెట్రోలియం శాఖ రంగంలోకి దిగింది. గ్యాస్ ఉత్పత్తిని తక్షణమే పెంచాలని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఇంధన కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కనీసం 10 శాతం గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్రం

- మిగతా2లో



## మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు

### ఉద్యమ ప్రస్థానంలో కీలక ఘట్టం : కెటిఆర్ ట్వీట్




## రంగానాయక్ సాగర్ పై ఎందుకీ తాత్సారం

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ఖండించారు. సమస్యల పై ఆందోళన చేస్తే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు.

- మిగతా2లో





## పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అందచేత

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం10వ విడత దొంగిలించబడిన మరియు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ స్వాధీనం చేసుకున్న మొబైల్

- మిగతా2లో

## నన్ను ఒక ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు: కవిత

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వం పై యుద్ధం ప్రకటించారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు

- మిగతా2లో



## 13న పిఎం కిసాన్ నిధులు విడుల

### అసోం వేదికగా ప్రధాని పంపిణీ




**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** దేశంలోని కోట్లాది మంది అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. పీఎం కిసాన్‌కు సంబంధించిన 22వ విడత నిధులు.. రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. దేశ వ్యాప్తంగా రూ. 9. 32 కోట్ల

- మిగతా2లో

## ఇంధన ధరలు దిగి వస్తాయి

### ట్రంప్ సంచలన ప్రకటన




**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** ఇరాన్ పై యుద్ధం కొనసాగుతుందని,వెనక్కి తగ్గేది లేదన్న ట్రంప్ కొంత మెత్తబడ్డారు. వెనక్కి తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఇరాన్ కూడా గట్టి హెచ్చరికలు చేయడంతోనో ఏమో యుద్ధానికి త్వరలోనే ముగింపు దొరుకుతుందని అన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, చమురు ధరలు కిందకు దిగి వస్తాయని అమెరికా అధ్యక్షుడు

- మిగతా12లో

## ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరల మోత

-మొదటిపేజీ తరువాయి

ఇదే సంర్భంలో గ్యాస్ ధరలు పెరిగాయి. అలాగే పెట్రో ధరలు పెరుగాయని అంటున్నారు. వీటి ప్రభావంతో నిత్యాసవరాలు కూడా పెరగక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ముఖ్యంగా పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలను ఖండించింది. కొంతపాలం పాటు నష్టాలను చమురు కంపెనీలు భరిస్తాయని వెల్లడించింది. రాబోయే 6 నుంచి 8 వారాల వరకు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోల్ నిల్వలు ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. అలాగే ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు కూడా ప్రస్తుతానికి సరిపోతాయని పేర్కొంది. అయితే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు ఈ వ్యవధి 21 రోజులు ఉండేది. మనదేశంలో సగటున ఒక కుటుంబం ఏడాదికి 7 నుంచి 8 సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. లాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. అయితే ప్రస్తుత భౌగోళిక ఉద్రిక్తతలు, గ్యాస్ సరఫరాలో కోత యూరియా ఉత్పత్తులపై ప్రభావం చూపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం 177.31 లక్షల టన్నుల ఎరువులు నిల్వలున్నట్టు తెలిపింది. వాటిల్లో 59.30దలక్షల టన్నుల యూరియా, 25.13 లక్షల టన్నుల డీఏపీ, 55.87 లక్షల టన్నుల ఎన్‌పీకేఎస్ నిల్వలున్నాయని పేర్కొంది.

## మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు

-మొదటిపేజీ తరువాయి

స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్ పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లు పూర్తయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు ఉద్యమ ప్రస్థానం ఉవ్వెత్తున ఎగిసిందని, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన కీలక ఘట్టాల్లో మిలియన్ మార్చ్ ఒకటని ఆయన పేర్కొన్నారు. 2011 మార్చి 10న మిలియన్ మార్చ్ సందర్భంగా నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్‌లు, ఇనుపకంచెలు ఇవేవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయని కేటీఆర్ ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. లక్షల గొంతుకలు తెలంగాణ రాష్ట్రం కోసం ట్యాంక్‌బండ్‌పై నినదించిన అద్భుత పోరాట రూపానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ అంటూ తన పోస్టును ముగించారు. ఈ పోస్టుకు మిలియన్ మార్చి నాటి కొన్ని ఫొటోలను షేర్ చేశారు. కింది పోస్టులో ఆ ఫొటోలను మీరూ చూడవచ్చు.

## రంగానాయక్ సాగర్ పై ఎందుకీ తాత్సారం

-మొదటిపేజీ తరువాయి

ఇదేనా ప్రజాప్రభుత్వం తీరు అంటూ విమర్శలు గుప్పించారు. మంగళవారం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా అంటూ మండిపడ్డారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కాలువ పనులు పూర్తి చేసి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల వైఫల్యాల వల్ల రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నారని కేంద్రమంత్రి అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే ఆయా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపీ సహా పార్టీ నాయకులను స్టేషన్‌కు తరలించడం అక్రమమని కేంద్రమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. రైతుల పై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తక్షణమే రైతులను, బీజేపీ నేతలను బేషరతుగా విడుదల చేయాలన్నారు. రంగనాయక్ సాగర్ 11వ ప్యాకేజీ నుంచి ఎల్ఎం 4, ఎల్ఎం 6 ద్వారా కాలువ పనులను పూర్తి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## 13న పిఎం కిసాన్ నిధులు విడుల

-మొదటిపేజీ తరువాయి

మంది రైతుల ఖాతాల్లో రూ.2000 వేల చొప్పున జమ కానున్నాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధులు మార్చి 13న విడుదల కానున్నాయి. ఈ పథకం కింద 22వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ కానున్నాయి. ప్రధాని మోదీ.. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పీఎం-కిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో వేస్తారు. ఈ దఫా కోసం మొత్తం రూ.19 వేల కోట్ల నిధులను కేటాయించారు. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో పీఎం-కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. గత ఏడాది నవంబర్ 19వ తేదీన 21వ విడత పీఎం-కిసాన్ నిధులు విడుదల చేశారు. ఈ పథకం ద్వారా దేశంలో పదకొండు కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరనుంది. ఇప్పటి వరకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్లకు పైగా అన్నదాతలకు ఈ నిధులు అందించబడ్డాయి.

## నన్ను ఒక ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు: కవిత

-మొదటిపేజీ తరువాయి

అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడం పై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పేదల కోసం గళమెత్తిన తనను ఒక ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కర్కశంగా కూల్చివేసిన తీరును తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చేవి అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును గమనించాలని కవిత సూచించారు. ఈ అన్యాయంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని, పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ వేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# మూడేళ్లలో పంచాయితీలకు శాశ్వత భవనాలు

-మొదటిపేజీ తరువాయి

అదే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు ప్రవేశపెట్టాలి. గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో ఏటీసీ కోర్సులు ప్రారంభిస్తాము. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఐటీడీఏల సహకారంతో గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. కవ్వాల్, శ్రీశైలం టైగర్ జోన్ల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వం ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధి పై చర్యలు తీసుకుంటుంది.డ్రగ్స్ మహమ్మారి నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. డ్రగ్స్ దుష్ప్రభావాలపై కళారూపాల ద్వారా యువతకు అవగాహన కల్పించాలి’ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇదిలావుంటే రాష్ట్రంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల పాత్రను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్జడెట్ వినియోగం, వచ్చే ఏడాది బ్జడెట్ ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించారు. విభాగాల వారీగా అధికారులు బ్జడెట్ ప్రతిపాదనలు సమర్పించగా వాటిలో పలు మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక్క రూపాయి కూడా. పెండింగ్ పడకుండా, వెనక్కి పోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగా గ్రామాలకు కేంద్ర నిధులు చాలా వరకు పెండింగ్లో ఉన్నాయని, ఈనేపథ్యంలో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన వాటాను సాధించాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. కేంద్రానికి రాష్ట్రం భారీగా పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులను సమర్థంగా సాధించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఖర్చు చేస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్లో ఉన్నాయని, అవసరమైన యుటిలిటీ సర్టిఫికెట్లు సమర్పించి వాటిని త్వరగా విడుదల చేయించు కోవాలన్నారు. 99 రోజుల ప్రణాళికల్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నంబర్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాలను త్వరితగతిన పూర్తి వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి ఈ భవ నాలను ప్రారం భించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆనంతరం వాటర్ షెడ్ డెవలప్మెంట్ కార్యక్రమంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆదివాసి, ఏజన్సి, గిరిజన ప్రాంతాల్లో అనేక వాగులు ఉన్నప్పటికీ వేసవికాలంలో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

# న్యాయవ్యవస్థ అవినీతి పాఠ్యాంశం తొలగించాం

-మొదటిపేజీ తరువాయి

ఈ అధ్యాయం పై సుమోటోగా కేసు నమోదు చేసిన సుప్రీంకోర్టు.. పాఠ్యపుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. దీంతో ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ , సభ్యులు పుస్తకంలో ప్రకటించిన అద్యాయానికి బేషరతుగా, తగిన అర్హతతో కూడిన క్షమాపణలు చెబుతున్నాం. మొత్తం పుస్తకం ఉపసంహ రించబడింది. అందుబాటులో లేదని పేర్కొంది. ఈ కారణంగా కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. సభ్యుల అవగాహనకు అభినందిస్తున్నాం అని పేర్కొంది. విద్యా సమాచారంలో ఖచ్చితత్వం, సున్నితత్వం మరియు బాధ్యతతో కూడిన అత్యున్నత ప్రమాణాలను నిర్వహించడానికి ఎన్‌సిఇఆర్‌టి కట్టుబడి ఉందని పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఆ పుస్తకం పై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు బ్లాంకెట్ బ్యాన్ విధించిన రెండు వారాల తర్వాత ఈ వివాదంపై ఎన్‌సీఈఆర్‌టీ స్పందించింది. సోమవారం బహిరంగ క్షమాపణలు చెప్పింది. పుస్తకం మొత్తాన్ని ఉపసంహరించుకున్నామని వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఆ పుస్తకాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవడం జరిగింది. అది ఇప్పుడు అందుబాటులో లేదు’ అని స్పష్టం చేసింది. పాఠ్యాంశం పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ పాఠ్యాంశాన్ని న్యాయ వ్యవస్థపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించ నని తేల్చి చెప్పారు. బుక్ పై నిషేధం విధించారు. అన్ని కాపీలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాదు. ఆన్‌లైన్ ద్వారా పుస్తకం మొత్తం లేదా దాని భాగాలను షేర్ చేయటంపై కూడా చీఫ్ జస్టిస్ నిషేధం విధించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌సీఈఆర్‌టీ ఛైర్మన్‌కు నోటీసులు జారీ చేశారు.

# దేశీయంగా 10శాతం ఎల్పిజి ఉత్పత్తి పెంపు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యంగా అంతర్జాతీయ పరిణామాల వల్ల సరఫరాలో ఏర్పడిన ఆటంకాలను అధిగమించి, దేశీయ అవసరాలకు తగినంత స్టాక్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం సూచించింది. సామాన్య ప్రజలకు వంట గ్యాస్ ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ఇరాన్ యుద్ధం భారత్‌లో చమురు ఆందోళనలు రేకెత్తిస్తోంది. దేశ ప్రజలకు ఇంధన, గ్యాస్ కొరత ఏర్పడకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురితో చర్చలు జరిపారు. ఎల్‌పీజీ ఉత్పత్తులు, సరఫరాపై సమీక్ష జరిపారు. ఇరాన్ యుద్ధం సామాన్యులపై ప్రభావం చూపకూడదని ప్రధాని మోదీ మంత్రులకు తెలిపారు. అలాగే యుద్ధంతో ఉత్పన్నమయ్యే అంతరాయాల గురించి చర్చించారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు పరిశ్రమల నుంచి గ్యాస్‌ను మళ్లించడం ద్వారా ప్రజలకు గ్యాస్ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఇరవై ఒక్క రోజుల తర్వాత బుకింగ్‌లు జరిగేవి, ఇప్పుడు25 రోజులకు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలానే ఎల్పీజీ ఉత్పత్తిని 10 శాతం పెరిగిందని కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధంతో హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కృత్రిమ కొరత కలగకుండా కేంద్రం ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రయోగించింది. బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను నియంత్రించే ఉద్దేశంతో పెట్రోలియం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో దాదాపు రెండున్నర లేదా మూడు రోజుల్లో వినియోగదారులకు గ్యాస్ సరఫరా జరిగేది, ప్రస్తుత పరిస్థితుల్లో కూడా అదే సమయం పడుతుందని వర్గాలు తెలిపాయి. అన్ని శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి, దేశవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 60 లక్షల సిలిండర్లు సరఫరా అవుతున్నాయని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. దేశంలో ఎల్‌పీజీ కొరత లేదని,సరఫరాను స్థిరీకరించామని కేంద్ర ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా దేశంలో పలు హోటళ్లు, రెస్టారంట్లు మూతపడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల నేపథ్యంలో కేంద్రం నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి రిఫైనరీలు ఎల్‌పీజీ ఉత్పత్తిని 10శాతం మేర పెంచాయని పేర్కొన్నాయి. కృత్రిమ కొరతను నిరోధించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ఎల్‌పీజీ సరఫరా విషయంలో సమస్యలను అర్థం చేసుకునేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలు వివిధ రెస్టారంట్ అసోసియేషన్లతో మాట్లాడుతాయి. ఇందుకోసం ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో ఓ కమిటీ ఇప్పటికే ఏర్పాటైంది. హోటళ్లు, రెస్టారంట్ల అవసరాలకు తగ్గట్టుగా కమిటీ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తుంది. అలాగే కొన్నిరోజుల వ్యవధిలోనే దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తి 10 శాతం మేర పెరిగింది. ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ కన్‌సైన్‌మెంట్ వివిధ వనరుల నుంచి వస్తోంది. కొత్త కన్‌సైన్‌మెంట్ కూడా వచ్చే అవకాశం ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో మనం గతంలో సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొన్నాం కానీ.. ఇప్పుడు అలాంటివి ఏమీ లేవు. ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణకు ముందువలే భారత రిఫనరీలు పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయి. మన ముడిచమురు దిగుమతుల్లో 70 శాతం హర్మూజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర వనరుల నుంచి సమకూరుతున్నాయి. ఇక సంక్షోభం తర్వాత ఇతర దేశాల కంటే మనమే మెరుగ్గా మనం కోలుకుంటాం. అంతేగాకుండా శుద్ధిచేసిన చమురు ఎగుమతులను నియంత్రించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అందచేత

-మొదటిపేజీ తరువాయి

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్లను గుర్తించి, యజమానులకు అందజేసే క్రమంలో భాగంగా 10వ దశలో 1,016 ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి యొక్క విలువ సుమారు 3,04,80,000 ఈ రికవరీ ప్రక్రియలో సీసీఎస్ శంషాబాద్ పోలీసులు 265, సీసీఎస్ శేరిలింగంపల్లి పరిధిలో 255, సీసీఎస్ కుత్బుల్లాపూర్ పరిధిలో 181, సీసీఎస్ కూకట్‌పల్లి పరిధిలో 160 మరియు సీసీఎస్ రాజేంద్రనగర్ పరిధిలో 155 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ.. ప్రజలు పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తిరిగి స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ఫోన్లను సులభంగా ట్రాక్ చేస్తున్నామని, ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్ నేడు ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధికి, వ్యక్తిగత అవసరాలకు కీలక సాధనంగా మారిందని, పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి యజమానులకు అప్పగించి వారిలో మళ్లీ ఆనందాన్ని నింపడం పోలీసుల బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ హెచ్చరించారు. ముఖ్యంగా అధిక లాభాల పేరుతో వచ్చే పెట్టుబడి పథకాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు తెలంగాణ వ్యాప్తంగా 'ఆపరేషన్ క్రాక్‌డౌన్' నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఆపరేషన్ ద్వారా సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఫ్రీజ్ చేసిన బ్యాంక్ ఖాతాల నుండి బాధితులకు వారి సొమ్ము తిరిగి అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన ఐటి టీమ్ మరియు పోలీసు అధికారులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా క్రైమ్స్ డీసీపీ ముత్యంరెడ్డి మాట్లాడుతూ.. ఫోన్ పోయిన వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయించడంతో పాటు బ్యాంకు ఖాతాలను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. మొబైల్ ఫోన్లకు బలమైన పాస్‌వర్డ్ లు లేదా బయోమెట్రిక్ లాక్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు తమ అనుభవాలను స్నేహితులు, బంధువులకు వివరించి వారిని కూడా అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులు అత్యాధునిక సాంకేతికతతో ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారని, ప్రజలు అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు అవి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే యూపీఐ పేమెంట్స్ ద్వారా బ్యాంక్ ఖాతాల నుండి నగదు విత్‌డ్రా చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బాధితుల అకౌంట్ల భద్రత కోసం గతంలో ఫ్రీజ్ చేసిన ఖాతాలను పరిశీలించి, సైబర్ నేరాలతో సంబంధం లేని సాధారణ వ్యక్తులు కు సంబంధినీచి ఈ రోజు 103 బ్యాంక్ ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేశామని ఆయన వెల్లడించారు. ఫోన్ పోయిన వెంటనే అప్రమత్తమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, తద్వారా ఆర్థిక నష్టాలను అరికట్టవచ్చని ఈ సందర్భంగా ఆయన సూచించారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని తిరిగి పొందిన పలువురు బాధితులు తమ అనుభవాలను పంచుకున్నారు. అల్వాల్‌లో జరిగిన ఎగ్జిబిషన్‌కు రెండు నెలల క్రితం తన పిల్లలతో వెళ్లిన ఓ మహిళ తన బ్యాగ్‌తో పాటు మొబైల్ ఫోన్ పోయిందని తెలిపారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఫోన్‌కు కాల్ చేసినప్పుడల్లా స్విచ్ ఆఫ్ రావడంతో తిరిగి దొరుకుతుందో లేదో అని ఆందోళన చెందానని చెప్పారు. అయితే సైబరాబాద్ పోలీసులు కృషి చేసి తన ఫోన్‌ను తిరిగి అందజేయడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు.మరో బాధితుడు తన మొబైల్ ఫోన్ పోయి చాలా కాలం అయిపోయిందని, ఇక అది దొరకదని భావించానని తెలిపారు. అయితే పోలీసులు అకస్మాత్తుగా ఫోన్ చేసి తన ఫోన్ దొరికిందని చెప్పడంతో ఎంతో ఆనందంగా అనిపించిందని చెప్పారు. రీంనగర్‌కు చెందిన మరో వ్యక్తి తన కూతురిని చూడటానికి నార్సింగ్ ప్రాంతానికి వచ్చినప్పుడు రోడ్డుపై నడుస్తుండగా జేబులో నుంచి మొబైల్ ఫోన్ పడిపోయిందని తెలిపారు. ఆ ఫోన్‌లో తన బ్యాంక్ ఖాతా వివరాలు మరియు ఇతర ముఖ్యమైన సమాచారం ఉండటంతో ఎవరైనా దుర్వినియోగం చేస్తారేమోనని భయపడ్డామని చెప్పారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయాలి





- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ఏటూరునాగారం, మార్చి 10 తెలంగాణ పత్రిక ములుగు జిల్లా స్టాపర్:

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని మొదటి విడతలో మంజూరు అయిన లబ్ధిదారులు తమ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వెంకటాపూర్ మండల కేంద్రంలో, నల్ల గుంట, ఎల్లారెడ్డి పల్లె గ్రామాలలోని నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను, గ్రామాల్లో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటాపూర్, నల్ల గుంట, ఎల్లారెడ్డి పల్లె, గ్రామాల్లో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని , వాటిలో ఎన్ని ఇండ్లు నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగిలినవి ఏ.ఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ ను లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇప్పించి ఇండ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణం అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అవుతున్నాయా అని ఆరా తీశారు. ఏ కారణాల చేత ఇండ్ల నిర్మాణాలు పెండింగ్ లో ఉన్నాయి అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలో మిగిలి ఉన్న నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తే చివరి బిల్లు కూడా వస్తుందని త్వరగా పూర్తి చేసుకొని ఉగాది పండుగ వరకు గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు. మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించక పోతే రద్దు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇల్లు మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత ద్వారా అనేక రకాల సీజనల్ వ్యాధులను నివారించవచ్చని అన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్వచ్ఛమైన పరిసరాల నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి సూర్యనారాయణ, వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ మామిడి శెట్టి సుగుణ, రామప్ప ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ మిల్కురి ఐలయ్య, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలు, వసతి గృహాల్లో కలుషిత ఆహార ఘటనలు పునరావృతం కారాదు

కొత్తగూడెం ఆర్సి, మార్చి 10 (తెలంగాణ పత్రిక):

జిల్లాలోని విద్యాసంస్థలు, వసతి గృహాల్లో కలుషిత ఆహార ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్‌తో కలిసి జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంఈఓలు, ఆర్సీవోలు తదితరులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి విద్యాసంస్థల్లో ఆహార భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై పూర్తి బాధ్యత సంబంధిత ఆర్సీవోలు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులదేనని స్పష్టం చేశారు. కలుషిత ఆహార ఘటనలపై కేవలం వంటవారు లేదా వార్డెన్లపై చర్యలు తీసుకోవడం సరిపోదని, ఇటువంటి ఘటనలు పునరావృతమైతే సంబంధిత ఆర్సీవోలు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా స్థాయి అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల మణుగూరులోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన కలుషిత ఆహార ఘటన దురదృష్టకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం కొందరు విద్యార్థినులు తమ తల్లిదండ్రులు ఇంటి నుండి తీసుకువచ్చిన బిర్యానీ, మాంసాహార పదార్థాలు తీసుకోవడంతో అస్వస్థతకు గురైనట్లు వెల్లడైందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణతో పాటు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన ఆహార భద్రత కమిటీ సభ్యులు ముందుగా వండిన ఆహారాన్ని




స్వయంగా రుచి చూసిన తరువాత మాత్రమే విద్యార్థులకు వడ్డించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యమైనది, పరిశుభ్రమైనది, పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని విద్యాసంస్థలు, వసతి గృహాలను తరచూ సందర్శిస్తూ ఆహార నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటే సంబంధిత అధికారుల పై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఐడీఓసీలో ప్రతి అంతస్తులోని కార్యాలయం తనిఖీ

- ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి
- రికార్డులు, ఫైళ్లు నిబంధనల ప్రకారం భద్రపరచాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 10, తెలంగాణ పత్రిక

ప్రతి ప్రభుత్వ కార్యాలయం నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం స్వచ్ఛత .. పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై తనిఖీ చేశారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ లోని నీటి పారుదల శాఖ, ఈఈ పీ ఆర్, ఆర్ అండ్ బీ, బీసీ సంక్షేమ శాఖ, డీటీ సీపీఓ, కార్మిక శాఖ, భూగర్భ శాఖ, డీఆర్ డీఓ, మైనింగ్, సీపీఓ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సహకార శాఖ, ఎక్సైజ్, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పౌర సరఫరాల శాఖ, ఉపాధి కల్పన శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా పంచాయతీ ఆఫీస్, ట్రెజరీ శాఖ, ఏవో ఆఫీస్, డీపీఆర్ఓ, సంక్షేమ శాఖ తదితర కార్యాలయాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని వివిధ గదుల్లో ఉన్న ఫర్నిచర్, ఫైల్స్, రికార్డులు, సామగ్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా శాఖ కార్యాలయం, మండలా




ల్లోని కార్యాలయాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యాలయంలోని ఫైళ్లు, రిజిస్టర్లు స్టోర్ రూమ్ లా సిద్ధం చేయాలని, నిబంధనల ప్రకారం భద్రపరచాలని స్పష్టం చేశారు. అనవసరమైనవి తొలగించాలని సూచించారు. కార్యాలయం ఆవరణలోని నిరుపయోగ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు తొలగించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న కుండీల్లో మొక్కలు పెట్టించాలని కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పై ఎమ్మెల్యే పాయం ను కలిసిన సర్పంచ్

- సమస్యల పరిష్కారానికై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం.

తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి మార్చి 10.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండల కేంద్రంలోని గ్రామ అభివృద్ధి, స్థానికంగా నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల రామనాథం ఆధ్వర్యంలో పినపాక సర్పంచ్ అలివేలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వివరించగా స్పందించిన ఎమ్మెల్యే పాయం సంబంధిత అధికారులతో చరవాణి లో మాట్లాడి సత్వరమే ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న బస్టాండ్ పునః ప్రారంభించాలనీ, గ్రామం లో విద్యుత్ స్థంబాల ఏర్పాటు, పలు కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మాణం, నూతన గిరిజన బాలుర వసతి గృహం ఏర్పాటు, బీసి బాలుర వసతి గృహం చుట్టూ ప్రహరీ గోడ, వంటి సమస్యలు విన్నవించి, ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు దారుల అప్లికేషన్ లు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఉప-సర్పంచ్ బోడ తిరుపతయ్య, సీనియర్ నాయకులు గొట్టేముక్కల స్వతంత్ర రెడ్డి, మహమ్మద్ యాకుబ్, యూత్ నాయకులు కోడిరెక్కల సాయికుమార్, తోకల సాయికుమార్, ఆత్మకూరి సతీష్, కోడిరెక్కల ప్రవీణ్, కొమ్మినేని మహేష్, సోంపెల్లి సాయి, సోంపెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మత్తులను దగ్గరుండి పని చేయిస్తున్న ఉల్లేర గ్రామ సర్పంచ్



తెలంగాణ పత్రిక రైకోడ్ మండల్: మార్చ్10-

ఎలక్షన్ లో ఇచ్చిన మాట కోసం ప్రజల రాకపోకలకు అంతరాయం గా ఉన్న రోడ్డు మార్గాన్ని గుంతలను మట్టితో పూడ్చి ట్యాంకర్ లతో నీటిని జల్లుతూ బాగుచేయడం జరిగింది. రాకపోకలకు రోడ్డు మార్గాన్ని బాగు చేసిన ఉల్గేరా గ్రామ సర్పంచ్ నరసింహ యాదవ్ గారిని గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలుపడం జరిగింది.

# వేస్టేజ్ కంపెనీ స్టోర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి.



కోదాడ,మార్చి 10(తెలంగాణ పత్రిక):

కోదాడ పట్టణ కోమర బండ వై జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసినటు వంటి వెస్టేజ్ కంపెనీ స్టోర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. వేస్టేజ్ కంపెనీ స్టోర్ లో ఆరోగ్యానికి మేలు చేసే సేంద్రీయ ఉత్పత్తులు, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు, నిత్యవసరాలు ఒకే చోట లభించడం ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టోర్ యజమాన్యం ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్స్ మల్లీశ్వరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆడెపు కృష్ణవేణి, మల్లికార్జున్, ఆడెపు సైదులు టీం. సభ్యులు,రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి, పేర బోయిన గోపి, పిడమర్తి గాంధీ, మామిడి గోపి,పూర్ణ, శ్రీనివాసరావు, మామిడి వెంకటేశ్వర్లు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమైక్య నూతన భవనాలను నిర్మించాలి

-పాలకుల నిర్లక్ష్యానికి అభివృద్ధికి నోచుకోని రత్నంపేట మహిళా సమైక్య (సంఘం) భవనము

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 10, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామాలలో మహిళా సంఘం (సమైక్య) భవనాలను నిర్మించి మహిళలకు సమావేశాలకు, కార్యక్రమాలకు, ప్రతి నెల మహిళలు పొదుపు చిట్టీలు, బ్యాంకు లోన్ల గురించి మాట్లాడుకు నేందుకు గ్రామాలలో మహిళా సంఘం భవనాలు లేకపోవడం వల్ల మహిళలు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్న సందర్భంలో ప్రభుత్వం గుర్తించి మహిళా సంఘం భవనాలకు గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించి నూతన నిర్మాణాలు , అలాగే పాత వాటికి మరమ్మత్తులు చేపట్టి అందుబాటులోకి తేవాలని,మండల సిపిఎం పార్టీ పక్షాన పాలకులకు, ప్రభుత్వ యంత్రాంగానికి పత్రిక ముఖంగా మహిళల పక్షాన,మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురి జల శ్రీధర్ డిమాండ్ చేయడం జరుగుతుంది.

# శ్రీ స్వామివారి విమాన రథోత్సవం కనుల పండువగా కొనసాగింది

భిక్కనూరు మార్చి 10 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)



భిక్కనూరు పట్టణ కేంద్రంలో శ్రీసిద్ధరామేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున ఉదయము 3;00 లకు స్వామివారి" విమానరథోత్సవం" పూల దండలతో ఆలంకరణలతో చూడటాని కి కనులపండువగా ముస్తాబైనది,రథంపై శ్రీ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉంచి దేవాలయం ప్రాంగణం నుండి కోనేరు వరకు రథాన్ని లాగటానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగుతూ" ఓం నమశ్శివాయ స్మరణతో" ఆలయ ప్రాంగణం మారుమోగినది, భక్తులు వారి మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయం తరఫున ఏర్పాట్లు ఆలయ ఈవో పి శ్రీధర్ దగ్గర ఉండి ఏర్పాట్లు చేశారు, ఈ క్రమంలో కలయ పున:నిర్మాణ కమిటీ సభ్యులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పక్కగా భూ హక్కుల కోసం రీ సర్వే

– జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 10 మార్చి

పక్కగా భూ హక్కుల కోసం రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ వివరించారు. మంగళవారం రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ 100 సంవత్సరాల పూర్వం నిజాం ప్రభుత్వం 35 నుంచి 40 సంవత్సరాల మధ్య కష్టపడి పనిచేసి భూమి నక్ష ను రూపొందించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి కొన్ని గ్రామాల్లో భూనక్షల్లో సమస్యల తలెత్త యన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకే భూ రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్లో పొంద పరుస్తామన్నారు. ఏలాంటి భూ వివాదాలు లేకుండా చేసి,భూమికి భూధార్ ను అందించడం జరుగుతుందన్నారు. భూమి ప్రతి రైతుకు ఒక సెంటిమెంట్ అని,భూమి కోసం రైతులు పరితపిస్తూఉంటారన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే దీని ఉద్దేశం అన్నారు. జిల్లాలో 24 గ్రామాల్లో భూ రిసర్వే ను శాస్త్రీయంగా నిర్వహించి రైతుల భూ హక్కులను పరిరక్షిస్థామన్నారు. భూ రిసర్వే అనంతరం విదేశాల్లో ఉన్న వాళ్ళు సైతం పక్కగా వారి భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి ,ఎ.డి ల్యాండ్ సర్వే కిషన్, డి.పిఆర్ ఓ రామచంద్ర రాజు, తహసిల్దార్ రజనీ,ఎంపీడీవో గ్రామ సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు

– చీపురు పట్టి సిబ్బందితో కలిసి పని చేస్తున్న దమ్మపేట పంచాయతీ పాలకవర్గం



తెలంగాణ పత్రిక/దమ్మపేట(మార్చి 10)

ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళ వారం దమ్మపేట పంచాయతీ పాలకవర్గ సభ్యులు చెత్త గల ప్రదేశాలను పారిశుధ్య సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ తేజరాణి పాల్గొని చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. మర్రి భక్తాంజనేయ స్వామి ఆలయం ప్రక్కన గల పంచాయతీ స్థలం, పశువుల ఆసుపత్రి, వాసవి క్లబ్ ప్రక్కన గల ప్రదేశాలను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టిన పాలక వర్గం సభ్యులు పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా చెత్త తొలగింపు, రోడ్ల శుభ్రత, డ్రైనేజీల క్లీనింగ్ మరియు ఇంటింటికీ తడి/పొడి చెత్త వేరు చేయడం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, బత్తుల సాయి, రూప రాంబాబు, చాట్ల శ్రీను, ఉయ్యాల లక్ష్మీనారాయణ, సిబ్బంది విజయ్, సింగ్, గణేష్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కవచాలు ఎంతో శ్రేయస్కరం

– వీణవంక సర్పంచ్ దాసారపు సరోజన – రాజేంద్రప్రసాద్..



వీణవంక ప్రతినిధి, మార్చ్ 10 ( తెలంగాణ పత్రిక).

వీణవంక మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచాలను మండలంలోని 100 మంది గీతా కార్మికులకు గ్రామసర్పంచ్ దాసరపు సరోజన – రాజేంద్ర ప్రసాద్, ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ మదాసి సునీల్ ల చేతుల మీదుగా పంపిణీ చేశారు . అనంతరం వారు మాట్లాడు తూ.. ప్రమాదాల నివారణకు, బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ మోకులను ఉచితంగా పంపిణీ చేస్తుందని, గీతా కార్మికులు వీటిని వినియోగించుకోవాలని అన్నారు. కాటమయ్య రక్షణ కవచాలను ఎలా ఉపయోగించుకోవాలో గీత కార్మికులకు అవగాహన కల్పిస్తూ, తాటి చెట్టు పైకి ఎలా ఎక్కాలి, ఎలా దిగాలి అనే అంశం పై ట్రైనర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సౌమ్య, ఎక్సైజ్ సిబ్బంది, ట్రైనర్లు అంజి గౌడ్, తిరుపతి గౌడ్, స్వామి గౌడ్, అంజి గౌడ్,మండల గౌడ సంఘం సభ్యులు, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల సంరక్షణకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి






– కలెక్టర్ గరిమ అగ్రవాల్

– చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో పశువులకు టీకాల పంపిణీ

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 10, తెలంగాణ పత్రిక

పశువుల సంరక్షణకు పెంపకందారులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆద్వర్యంలో పాల కేంద్రం ఆవరణలో మంగళవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ప్రారంభించారు. పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పాల కేంద్రాన్ని పరిశీలించి గ్రామంలో ఎన్ని పాడి పశువులు ఉన్నాయి? ఎన్ని లీటర్ల పాలు వస్తాయి? ఎక్కడ విక్రయిస్తారు అనే వివరాలను పాల కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.అలాగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామంలో కొనసాగుతున్న పనులపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రోగాల బారిన పడిన పాడి పశువులు పాలు తక్కువ ఇస్తాయని వివరించారు. పాలు, పాల ఎగుమతుల పై ఆ ప్రభావం పడుతుందని స్పష్టం చేశారు. పెంపకందారులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. పెంపకందారులు తమ జీవాల ఆరోగ్య సంరక్షణ, ఆర్థికంగా నష్ట పోకూడదనే ఉద్దేశంతో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ప్రభుత్వం ఉచితంగా వేయిస్తుందని పేర్కొన్నారు. పెంపకందారులు ముందస్తుగా టీకాలు వేయించి.. ఆ రోగాల బారి నుంచి తమ జీవాలను రక్షించాలని సూచించారు. అన్ని పాడి పశువులు, ఎద్దులు, దూడలకు పశువుల పెంపకందారులు, రైతులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, జిల్లాలో 97 వేల జీవాలు ఉన్నాయని, పశు వైద్య డాక్టర్లు, సిబ్బంది 26 టీమ్ లుగా ఏర్పడి వచ్చే నెల ఏప్రిల్ 9వ తేదీ వరకు టీకాలు వేస్తారని తెలిపారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో జిల్లాలోని అన్ని గ్రామాలు, రెండు మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ఆద్వర్యంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి .. గృహ ప్రవేశానికి సిద్దం చేయాలని ఆదేశించారు. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులు వేగంగా పనులు చేపట్టి.. జూన్ 2వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. యూత్ అండ్ స్పోర్ట్స్ ఆధికారి ఆద్వర్యంలో యువతకు 5కే రన్, ఉపాధి కల్పన శాఖ ఆద్వర్యంలో జాబు మేళాలు చేపడుతారని కలెక్టర్ తెలిపారు. వ్యవ సాయ, విద్యాశాఖ, అటవీ శాఖ, డీఆర్డీఓ వివిధ శాఖల ఆద్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా చేపడుతున్న పనుల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గాలికుంటు వ్యాధి బారిన పడిన జీవాల శరీర ఉష్ణోగ్రత 104ºF – 106ºF పెరిగి పశువులు నీరసించి పోతాయని, పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని, వాటి నోరు అలాగే గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి, 24 గంటల్లో చితికిపోయి పొక్కులు, పుండ్లుగా మారి నొప్పి వలన పశువులు మేత నీరు తీసుకోక నీరసించి చనిపోయే ప్రమాదం ఉందని పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. పశువుల పాకలను శుభ్రంగా ఉండాలని సూచించారు. టీకాలు వేసి గుర్తింపు కొరకు చెవి పోగు వేయించి ఆ వివరాలు భారత్ పశుధాన్ యాప్ లో నమోదు చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ దూది మనీషా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి, ఎంపీడీఓ రాధ, పశు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలను కాపాడాలని అధికారులను వేడుకున్న వీణవంక రైతులు

– నీటిపారుదల అధికారులకు వినతి పత్రం అందజేత..

వీణవంక ప్రతినిధి, మార్చి 10( తెలంగాణ పత్రిక).



వీణవంక గ్రామ శివారులోని వీణవంక చెరువు వెనుక రైతులు పంట పొలాలకు చెరువులో సరిపడ నీరు లేక మంగళవారం హుజురాబాద్ డివిజన్ నీటిపారుదల శాఖ అధికారులకు సాగునీరు కావాలని, పంట పొలాలను రక్షించాలని కోరుతూ, 60 మంది రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. పొట్టకు వచ్చిన వరి పొలాలను సాగునీరు సకాలంలో అందించి, రైతులను కాపాడాలని, 200 ఎకరాల వరి పొలాలపై వెయ్యి మంది రైతు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని,జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి, సకాలంలో సాగునీరు అందించాలని, రైతులను కాపాడాలని, వీణవంక రైతులు ప్రాధేయ పడుతున్నమన్నారు. రైతుల సమస్యపై నీటిపారుదల అధికారులు డి ఈ ఈ మమత, ఏ ఈ ప్రత్యూష లు స్పందిస్తూ.. పై అధికారులకు విషయం తెలియపరచి, సాగునీటిని పంట పొలాలకు అందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. వేసవిలో రెండు తూములు రిపేర్ చేసి, చెరువులో సాగునీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.ఈ వినతి పత్రం అందించిన వారిలో నీల మొండయ్య, ఫ్యాక్స్ మాజీ డైరెక్టర్ రాంపల్లి రాములు, వేణు రవి, వేణు సంపత్, తాటికొండ సదానందం, గెల్లు కొమురయ్య , ముద్దెర శ్రీనివాస్,ముష్క శ్రీనివాస్, ముష్క రంజిత్, దాసరపు పోచయ్య, మిడిదొడ్డి సమ్మయ్య,రెడ్డి రాజుల చెంద్ర మొగిలి, నీల శ్రీనివాస్,నీల జంపయ్య, తొట్ల మల్లయ్య, దాడ రవీందర్, ఆశీర్వాదం, రాములు,వేణు కిషన్ తదితరులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడలు శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి అవసరం

– క్రీడలతో ఒత్తిడి దూరం

– మెదక్ జిల్లా ఎస్పీ. డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 10 మార్చి



క్రీడలు శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి అవసరం అని క్రీడలతో ఒత్తిడి దూరం దూరమావుతుందని మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి.శ్రీనివాస రావు ఐపీఎస్ అన్నారు. మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పోలీసు వార్షిక క్రీడోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ జెండా ఆవిష్కరించి క్రీడా పోటీలకు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.క్రీడోత్సవాల ప్రారంభానికి ముందు నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ పరిశీలించి సిబ్బంది నుంచి వందనం స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొంటూ క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తూ అనేక సవాళ్లను ఎదుర్కొంటారని, అలాంటి పరిస్థితుల్లో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించడంలోసహాయపడతాయని తెలిపారు.అదేవిధంగా క్రీడా పోటీలు సిబ్బందిలో ఐక్యత, జట్టు భావన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిం చడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. విధుల్లో ఎంత నిబద్ధతతో పని చేస్తారో, అదే ఉత్సాహంతో క్రీడల్లో కూడా పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచించారు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా కీలకంగా ఉంటాయని చెప్పారు.ఈ క్రీడోత్సవాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, పరుగుపందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి పలు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ముగింపు కార్యక్రమంలో బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐలు మహేష్, రేణుక రెడ్డి, కృష్ణమూర్తి, జాన్ రెడ్డి, వెంకట రాజా గౌడ్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బోయినపల్లి మండలంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పర్యటన

– ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 10, తెలంగాణ పత్రిక



చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం బుధవారం రోజున బోయినపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. 'ప్రజా పాలన ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేయనున్నారు.ఉదయం 10:30 గంటలకు: బోయినపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారు.బూరుగుపల్లి గ్రామంలో సిఆర్ఆర్ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాల్లో మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

# నీలోజిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ తనిఖీ





**- రెండు రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి10, తెలంగాణ పత్రిక**

గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ మంగళవారం నీలోజిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యతను మరియు మెనూను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పర్యవేక్షించి, చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్యను గుర్తించిన సర్పంచ్, రాబోయే రెండు రోజుల్లో పైపులైన్ మరమ్మతులు చేయించి నీటి ఇబ్బందిని శాశ్వతంగా పరిష్కరిస్తామని అక్కడి సిబ్బందికి హామీ ఇచ్చారు. చిన్నారుల ఆరోగ్యం మరియు భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుసుమ మహేందర్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు ఉమ్మారెడ్డి శైలజ, అనిల్, కుడుకల శ్రీకాంత్, అనుముల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూరు మండలంలో సెగలు రేపుతున్న పారిశ్రామిక వ్యతిరేక ఉద్యమం

**- జనవరి 07 జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పటికి ఊసులేదు?**

**- పాలకుల మౌనం.. గ్రామాల గర్జన!**

**భిక్కనూరు మార్చి 10 ( తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి )**



భిక్కనూరు మండలంలో పారిశ్రామికీకరణ మంటలు మరోసారి రేగుతున్నాయి. సాగు భూములను,పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మండలం గడ్డపై నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ముఖ్యంగా పర్యావరణానికి ముప్పు తెచ్చే పరిశ్రమలను అడ్డుకునేందుకు కాచాపూర్, పెద్దమల్లారెడ్డి వంటి గ్రామాలు ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు బహిరంగంగా తీర్మానాలు అందజేయడంతో ఉద్యమం కీలక దశకు చేరుకుంది.

ప్రజాభిప్రాయ సేకరణ నివేదిక: గోప్యత వెనుక మతలబు ఏంటి?

గతంలో జనవరి 07 న నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలో ఏముందనేది ఇప్పుడు మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నివేదికలోని అంశాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా నివేదికలు ఉంటే సహించేది లేదని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. స్థానిక ప్రజల భవిష్యత్తును నిర్ణయించే ఈ నివేదికను పారదర్శకంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమాల గడ్డ.. కాచాపూర్ స్ఫూర్తి..

గతంలో ఎం.ఎస్.ఎన్ కంపెనీకి వ్యతిరేకంగా దాదాపు 120 రోజుల పాటు మొక్కవోని దీక్షతో పోరాడిన కాచాపూర్ గ్రామస్తుల స్ఫూర్తి నేడు మండలమంతా పాకుతోంది. తమ భూములను, భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని పణంగా పెట్టలేమని వారు చాటిచెప్పారు. ఇప్పుడు పెద్దమల్లారెడ్డి గ్రామస్తులు కూడా కలెక్టర్‌కు తీర్మానం ఇవ్వడంతో భిక్కనూరు గ్రామ పరిపాలన విభాగంపై ఒత్తిడి పెరిగింది.

పాలకవర్గం మౌనం వీడాలి.. భిక్కనూరు కేంద్రమే కీలకం

ఈ ఉద్యమంలో భిక్కనూరు మండల కేంద్రం ముందుండి నడవాల్సిన అవసరం ఉంది. కేవలం అభివృద్ధి పేరుతో వినాశనాన్ని ఆహ్వానించడం సరికాదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల భవిష్యత్తు కోసం పాలకవర్గం పగ్గాలు చేపడుతుందా? లేక ఇలాగే మౌన ముద్రలో తటస్థంగా ఉంటుందా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. ఒకవేళ వినాశనాన్ని ఆపకపోతే భిక్కనూరు మండలం కాలుష్య పరిశ్రమల అడ్డాగా మారే ప్రమాదం ఉంది. స్థానిక పాలకవర్గం ప్రజల పక్షాన నిలబడి, పారిశ్రామిక విస్తరణను అడ్డుకోవాలి. "మా భూములు మాకు కావాలి.. మా ఊపిరిని కలుషితం చేయకండి." ఇది నిరసనకారుల ప్రధాన నినాదం. ప్రస్తుతం కాచాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాల చొరవతో భిక్కనూరు మండల కేంద్రంలో చర్చ తీవ్రమైంది. పాలకవర్గం ప్రజల కోసం కదులుతుందా? లేక మౌనంగా ఉండిపోతుందా? అనేది వేచి చూడాలి.

# గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు ఆందోళనకరం

**- ప్రభుత్వ నిర్లక్ష్యం పై టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు రవి గౌడ్ ఆగ్రహం**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 10, తెలంగాణ పత్రిక**




గురుకుల విద్యాసంస్థల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు గురుకుల బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం కారణంగా సుమారు 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట గురుకుల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నా ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. తెలంగాణ తొలి సిఎం కేసిఆర్ నాయకత్వంలో గురుకుల విద్యా వ్యవస్థ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అదే వ్యవస్థను భ్రష్టు పట్టించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉండటం బాధాకరమని తెలిపారు. గురుకులాల్లో ఆహార నాణ్యత పై ప్రభుత్వం వెంటనే సమీక్ష నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎక్కడ అన్యాయం జరిగినా కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం గురుకుల వ్యవస్థను మెరుగుపరచాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.కె. అప్రోచ్, అరికెల వినయ్ కుమార్, మార్గం కార్తికేయ, సాయి నవీన్, ఎస్.కె జుబేర్ లింగంపల్లి అబ్బి అనురిత్ శివ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఐ కోర్సుల్లో ప్రైవేట్ అభ్యర్థులకు అవకాశం దరఖాస్తుల చివరి తేది మార్చి15

**కొత్తగూడెం ఆర్ సి మార్చ్ 10 ( తెలంగాణ పత్రిక)**

ప్రభుత్వ ఐటీఐ కోర్సుల్లో ప్రైవేట్ అభ్యర్థిగా అఖిల భారత వృత్తి శిక్షణ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రభుత్వ ఐటీఐ కొత్తగూడెం ప్రిన్సిపాల్ జి. రమేష్ తెలిపారు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే చివరి తేది మార్చి 15, 2026 సాయంత్రం 5 గంటల వరకుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. వృత్తి శిక్షణ జాతీయ మండలి పరిధిలో ఉన్న కోర్సులకు అర్హత గల విద్యార్థులు ప్రాంతీయ ఉప సంచాలక కార్యాలయం, ప్రభుత్వ ఐటీఐ వరంగల్ ప్రాంగణం, ములుగు రోడ్, వరంగల్ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు 21 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అర్హులు. 21 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత ఏ వయస్సు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులను నాలుగు వర్గాలుగా పరిగణిస్తారు. వర్గాలు ఇవి: మొదటి వర్గం: ఐటీఐలో శిక్షణ పూర్తిచేసి ఉత్తీర్ణులైన మాజీ శిక్షణార్థులు, రెండవ వర్గం: కేంద్ర ప్రతిభా పథకం కింద శిక్షణ పూర్తిచేసిన లేదా ప్రస్తుతం శిక్షణ పొందుతున్న వారు, మూడవ వర్గం: 2018 ఆగస్టు వరకు రాష్ట్ర వృత్తి శిక్షణ మండలి కింద ప్రవేశం పొందిన అభ్యర్థులు, నాలుగవ వర్గం: పై మూడు వర్గాల్లోకి రాని ఇతర అభ్యర్థులు .అర్హత గల విద్యార్థులు వరంగల్‌లోని ప్రాంతీయ ఉప సంచాలక కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు సమయంలో శాశ్వత మొబైల్ నంబర్ మరియు ఈమెయిల్ చిరునామా ఇవ్వాలని తెలిపారు. సీట్ల కేటాయింపు మెరిట్, అభ్యర్థి ఎంచుకున్న కోర్సు మరియు శిక్షణ సంస్థ ఆధారంగా జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఉన్న కోర్సులకు ఒకే దరఖాస్తుతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అడ్మిషన్లు రాష్ట్ర ప్రభుత్వం మరియు సంబంధిత శిక్షణ శాఖ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడతాయని ప్రిన్సిపాల్ జి. రమేష్ వెల్లడించారు.


2. Category-I: Ex-Trainees (successful pass-outs) of ITI.
3. Category-II: Ex-Trainees (successful pass-outs) and current trainees under CoE scheme.
4. Category-III: SCVT candidates (admitted till august 2018 session)
5. Category-IV: Other candidates (candidate not falling in any of the above 3 categories, including SCVT trainees enrolled from admission session 2019 onwards.

# సావిత్రిబాయ్ పూలే స్ఫూర్తి తరతరాలకు ఆదర్శం

## ఎమ్మెల్యే జారె



**తెలంగాణ పత్రిక దమ్మపేట మార్చి 10**

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గండుగులపల్లి క్యాంపు కార్యాలయం నందు భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రి బాయ్ పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సావిత్రిబాయ్ పూలే భారతదేశంలో మహిళల విద్యకు పునాది వేసిన మహనీయురాలని కొనియాడారు తన భర్త జ్యోతిరావు పూలే తో కలిసి బాలికల విద్య కోసం తొలి పాఠశాలను స్థాపించి సమాజంలో అణగారిన వర్గాలకు విద్యా వెలుగులు పంచారని తెలిపారు మహిళలు చదువుకుని సమాజంలో గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో ఆమె జీవితాంతం కృషి చేశారని అన్నారు సమాజంలో సమానత్వం విద్యా హక్కుల కోసం ఆమె చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు మహిళల సాధికారత విద్యాభివృద్ధి కోసం ఆమె చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రథమ పౌరురాలుకి ఘనంగా సన్మానం




**భిక్కనూర్ మార్చి 10 ( తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి )**

మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భిక్కనూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళామణులకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భిక్కనూర్ గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘానికి చెందిన మహిళలు సర్పంచ్ బల్యాల రేఖను పూలమాల తో శాలువాతో సన్మానించి తమ అభినందనలు తెలియజేశారు. సన్మానం అనంతరం బల్యాల రేఖ మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు ఎంతో గౌరవం ఉంటుందని, ప్రభుత్వాల నుంచి మహిళలకు వివిధ రంగాల్లో ప్రోత్సాహం లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు. మహిళలు వారికి లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘానికి చెందిన మహిళలు,సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి'

**- సర్పంచ్ సంధ్య-విజయ్ కుమార్**

**- నారికి జేజేలు సేవాలకు సన్మానాలు**




**కామారెడ్డి, మార్చ్10,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కామారెడ్డి జిల్లా సదాశివ్ నగర్ మండలం వజపల్లి తండా సర్పంచ్ సంధ్య-విజయ్ కుమార్ అన్నారు.సదాశివనగర్ మండలం వజ్జపల్లి తండాలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఏఈ పిఆర్ సురేష్, ఆర్ఐ సంతోష్,అంగన్వాడీ సూపర్వైజర్ పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారత సాధ్యం కావాలంటే సొంతంగా నిర్ణయాలు తీసుకుని ఉన్నత స్థానానికి వెళ్లాలన్నారు.ప్రతీ మహిళా చదువుకొని తన కాళ్ల మీద తాను నిలబడాలని సూచించారు.ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యం సాధ్యమవుతుందని వివరించారు. గతంతో పోలిస్తే రాజకీయ రంగాల్లో మహిళలు కొంత రాణిస్తున్నారని మరింత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సహాయాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. తండాలో మహిళల ఆర్థికాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తాండ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామంలో సమైక్య మహిళా భవనానికి మార్కౌట్ వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి, ఉప సర్పంచ్ రవీందర్,వార్డు సభ్యులు పన్ని, నాజీ, దేవిసింగ్, లక్ష్మణ్, లలిత, లక్ష్మి, ఉపాధ్యాయులు ప్రవీణ్, అజయ్, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, మంజుల, గ్రామస్థులు సురేందర్, మోతిరం, భాస్కర్,ఫిర్యా,గణేష్,రమేష్ తదితరులు ఉన్నారు.

# ఆర్డిఓ కి వినతి పత్రం

చండూర్ మున్సిపాలిటీలో గ్యాస్ ఏజెన్సీ కోసం ఆర్డిఓ కి వినతిపత్రం

-AIJP.






చండూరు తెలంగాణ పత్రిక మార్చి 10

చండూర్ మున్సిపాలిటీ మునుగోడు నియోజకవర్గంలో ఉన్న రెండో మున్సిపాలిటీ, గా ఏర్పడక ముందు మేజర్ గ్రామపంచాయితీ గా ఉన్న పట్టణం, ఇక్కడ గ్యాస్ ఏజెన్సీ లేకపోవడం విచారకరం అని విలేకర్ల సమావేశం ఆల్ ఇండియా జనతా పరివార్ పార్టీ జిల్లా ఇంచార్జ్ అన్నారు. 50–60 వేల జనాభా ఉన్న చండూర్ మండలం లో ప్రతి ఇంట్లో పొద్దునే వంట చేయాలన్న కావాల్సింది గ్యాస్, అలాంటి గ్యాస్ ను సప్లై చేయడానికి ప్రభుత్వ అనుమతి కల్గిన గ్యాస్ ఏజెన్సీ అవసరం మరి చండూర్ లో ఎలాంటి గ్యాస్ ఏజెన్సీ లేకపోవడం తో చుట్టూ ప్రక్కల మండలాలు జిల్లా కేంద్రం నుండి గ్యాస్ సప్లై అవుతుంది, దూర ప్రాంతం నుండి గ్యాస్ సప్లై వల్ల అదనంగా ట్రాన్స్పోర్ట్ పెరిగి వినియోగదారుడు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి, అలాగే సప్లై లో కూడా ఆలస్యం అవుతున్నడం తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, చండూర్ లో గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు కోసం ఈరోజు చండూర్ ఆర్ డి ఓ గారిని కలిసి సమస్యను త్వరలో పరిష్కారం చేయమని కోసం వినతి పత్రాన్ని అందించడం జరిగిందని యం డి రఫీ తెలిపారు.

## మాచారెడ్డిలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్



కామారెడ్డి , మార్చి 10,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం కామారెడ్డి జిల్లామాచారెడ్డి మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రారంభించారు. కామారెడ్డి జిల్లాలో పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం 8వ విడత గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఆశిష్ సంగ్వాన్, అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం మార్చి 10, 2026 నుండి ఏప్రిల్ 9, 2026 వరకు నెల రోజుల పాటు కొనసాగుతుంది. జిల్లాలోని 25 మండలాల్లో మొత్తం 1,42,400 ఆవులు , గేదెలకు టీకాలు వేయడం లక్ష్యంగా పెట్టబడింది. ఈ భారీ కార్యక్రమం కోసం పశుసంవర్ధక శాఖ 48 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఇంటింటికి వెళ్ళి ఏ ఒక్క పశువు మిగిలిపోకుండా టీకాలు వేస్తాయి. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, గాలికుంటు వ్యాధి అనేది గాలి ద్వారా వేగంగా వ్యాపించే వైరల్ ఇన్ఫెక్షన్ అని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. “టీకా వేయించడం అనేది కేవలం ఆరోగ్య చర్య మాత్రమే కాదు; ఇది రైతు జీవనోపాధికి ఒక రక్షణ కవచం వంటిది. గాలికుంటు వ్యాధి వల్ల పశువుల పాల దిగుబడి తగ్గడం, వంధ్యత్వం, బరువు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ 8వ విడతలో అన్ని ఆవులు, గేదెలకు టీకాలు వేయించడం ద్వారా రైతులు ఆర్థిక నష్టాలను నివారించడం , పశువుల దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు“ అని తెలిపారు. పశువైద్య బృందాలు గ్రామాలను సందర్శించే సమయంలో రైతులు, పశువుల యజమానులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. గ్రామాలకు బృందాలు వచ్చినప్పుడు పశువులను సిద్ధంగా ఉంచి, వాటిని కట్టి ఉంచాలని పశుసంవర్ధకశాఖ అభ్యర్థించింది. ఈ కార్యక్రమానికి జిల్లా పశు వైద్య ,పశు సంవర్ధక అధికారి, కామారెడ్డి నేరుగా పర్యవేక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం సందర్శించిన కలెక్టర్

కామారెడ్డి , మార్చి 10, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళ వారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాచారెడ్డి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని సందర్శిం చారు. అటవీ శాఖలో నిర్వహించే అన్ని కార్యకలాపాలను అటవీ అధికారులు కలెక్టర్ గారికి ప్రదర్శించగా, గ్రామీణ అటవీ ప్రాంతాల్లో లభ్యమయ్యే స్థానిక వృక్ష జాతులు, అడవి జంతువుల పాదముద్రలు (పగ్ మార్క్స్), మల అవశేషాలు (స్కాట్స్), ఇతర గుర్తులను వివరించారు. అదేవిధంగా అటవీ శాఖలోని కార్యకలా పాల ఫోటోలు ప్రదర్శించి, అటవీ అగ్నిప్రమాదాలను నియంత్రి ంచడానికి ఉపయో గించే ఫైర్ ఎక్విప్మెంట్, అగ్నిప్రమాదాల నియంత్రణ విధానాలను వివరించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, గ్రామీణ అటవీ ప్రాంతా ల్లో అడివి సంరక్షణ,భద్రతకు అటవీ అధికారులు,ప్రజా భాగస్వామ్యం పై దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా అటవీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మరింత లాభాలు చేకూరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి మంత్రికి వినతి పత్రం

- తెలంగాణ చేనేత కార్మిక సంఘం

చండూరు తెలంగాణ పత్రిక మార్చి 10



రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీ చెరుపల్లి సీతారాములు ఎక్స్ మ్మెల్సీ గారి నాయకత్వాన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీ గంజి మురళీధర్, కార్యదర్శి శ్రీ ముషం నరహరి, ఉపాధ్యక్షులు శ్రీ వర్కాల చంద్ర శేఖర్ గారలతో కూడిన ప్రతినిదివర్గం హ్యాండ్ లూమ్ టెక్స్ టైల్ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర్ రావు గారిని వారి నివాసంలో కలిసి చేనేత పరిశ్రమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించాము. చేనేత కార్మికుల ఋణమాఫీకి సంబందించిన 16.27 లక్షలు ప్రభుత్వం నుండి వచ్చాయని అందరికి అమలు అవుతాయని అన్నారు. చేనేతపై తీసుకున్న ఋణమాఫీ ఫైల్లు బ్యాంకు వారు లేవంటున్నారని అధికారులు వాటిని పరిశీలించి బ్యాంకు వారు ఇచ్చిన లేఖను ఆధారంతో అధికారులు ఋణమాఫీ చేయాలని కోరినాము. త్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వం రెండు నెలలు డిపాజిట్ చేసి నెలలు గడుస్తున్నా వేయలేదు. చేనేత కార్మికులు నెల వారిగా డిపాజిట్ చేస్తున్నారు. చేనేత కార్మికుల బ్యాంకు అకౌంట్లో వెంటనే త్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వం జమ చేయాలని కోరినాము. గతంలో ఉన్న యార్న్ సబ్సిడీ (చేనేత చేయూత )స్థానంలో నేతన్న భరోసా పథకం ప్రకటించి నేటి వరకు అమలు జరుపలేదు. చేనేత కార్మికునికిరూ రూ.2000/– అనుబంధ కార్మికులకు ఇద్దరికీ రూ.500/– జమ చేస్తూ నేతన్న భరోసా పథకం వెంటనే అమలు జరుపాలని కోరినాము. నేతన్న భీమా పథకంలో 59 సంవత్సరాల లోపల వారికి ఇన్సూరెన్స్ కంపెనీలు ఇస్తున్నారు 59 పైబడిన చేనేత కార్మికులకు ఎక్స్ గ్రేషియో రూ.5 లక్షలు టెస్కోలో డబ్బులు లేవని ఏడాదిన్నర నుండి ఇవ్వడం లేదు. షరతులు లేకుండా నేతన్న భీమా పథకం వెంటనే ఇవ్వాలని కోరినాము. గతంలో ఉన్న ఐసీసీ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం చేనేత కార్మికులకు ఉపయోగకరంగా ఉండేది. అది కాస్తా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. దాని స్థానంలో చేనేత కార్మికులకు రాష్ట్ర పథకం హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు చేయాలని కోరినాము. వెనుక బడిన తరగతుల, షెడ్యూల్ కులాల, తెగల, సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ గురుకులాలకు టెస్కో నుండి చేనేత వస్త్రాలను ఇప్పటి వరకు కొనుగోలు చేస్తున్నట్లుగానే భవిష్యత్ లో కూడా కొనుగోలు చేయాలని కోరినాము. మంత్రి గారు స్పందించి సంబందించిన అధికారులతో మాట్లాడుతామని అన్నారు. వినతి పత్రంలో చేనేత పారిశ్రామిక సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ ఋణం మాఫీ చేయాలని, చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, చేనేత కార్మికులకు హౌస్ కం వర్క్ షెడ్ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇవ్వాలని ప్రతి చేనేత కార్మికుడికి పెట్టుబడి సాయం కింద వడ్డీ లేని ఋణం రూ.5 లక్షలు రూపాయలు ఇవ్వాలని జియో టాగ్ వేసిన చేనేత కార్మికులకు త్రిఫ్ట్ పథకం అమలు చేయాలని,అర్హులైన చేనేత కార్మికులకు వేస్తున్న జియో టాగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, చేనేత వస్త్రాలకు డూప్లికేట్ ను అరికట్టాలి.వస్త్ర నిల్వలను టెస్కో ఖరీదు చేయాలి.చేనేతకు 11రకాల వస్త్రాలను రిజర్వ్ చేసిన చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఖచ్చితంగా పూర్తి స్థాయిలో అమలు చేయాలి. గద్వాల జిల్లా రాజోలి, నల్లగొండ జిల్లా చండూర్, నకిరేకల్ లో వర్షాకాలంలో మగ్గం గుంటలోనికి ఊటనీరు చేరిన చేనేత కార్మికులకు స్థాండ్ మగ్గాలు ఇవ్వాలి. మరియు హౌస్ కం వర్క్ షెడ్ ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేయాలని కోరనైనది.రద్దయిన కేంద్ర పథకాలను తిరిగి పునరుద్దరణ జరిగేటట్లు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరనైనది. వనం శాంతి కుమార్ రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ చేనేత కార్మిక సంఘం.

## ప్రజాపాలనను ప్రజలకు చేరువ చేయడానికి స్థానిక ప్రజాప్రతి నిధులకు సమగ్ర అవగాహన కల్పించాలి





- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 10 మార్చి

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మార్చి 12వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణా తరగతులకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుండి సీఎస్ రామక్రిష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం, 12వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమం నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ..ప్రజాపాలనను మరింత ప్రజలకు చేరువ చేయడానికి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా మార్చి 12న నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి సంబంధించి విభాగాల వారీగా మినిట్ టు మినిట్ ప్రోగ్రాం రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ మున్సిపల్ అధికారులు, జిల్లా పంచాయతి అధికారుల నుండి రోజువారీ నివేదికలు అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, గ్రామాలు, పట్టణాల్లో శుభ్రత మరియు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు చిన్నారుల హత్య ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురైన షబ్బీర్ అలీ

కామారెడ్డి, మార్చి 10,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి పట్టణంలో ముగ్గురు పిల్లల హత్య చేసిన సంఘటన తెలిసి బాగోద్వేగానికి గురైన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీజరిగిన హృదయ విదారక ఘటన అందరినీ కలచివేసింది. కన్నతండ్రే కాలయముడై అభం శుభం తెలియని ముగ్గురు చిన్నారులు షిఫత్, ఆయాత్, మరియం, లను చెరువులో పడేసి హత్య చేసిన ఘటన పట్టణ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ అమానుష ఘటన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ ని తీవ్రంగా కలిచి వేసింది.

**బాధిత తల్లిని ఓదార్చిన షబ్బీర్ అలీ**

ఘటన సమాచారం తెలుసుకున్న వెంటనే షబ్బీర్ అలీ గారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ముగ్గురు బిడ్డలను కోల్పోయి విలపిస్తున్న తల్లిని చూసి ఆయన కూడా భావోద్వేగానికి గురయ్యారు. ఆమెను ఓదార్చుతూ ధైర్యం చెప్పే సమయంలో ఆయన కళ్లు చెమ్మగిల్లాయి.

**ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ**

ఒక మనిషి ఇంత క్రూరంగా ఎలా ప్రవర్తిస్తాడు? కన్నబిడ్డలను చంపుకోవడానికి మనసెలా ఒప్పింది? ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన అన్యాయం కాదు, మానవత్వానికే తలవంపులు అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు విన్నపం చేశారు దయచేసి మన చుట్టుపక్కల ఎవరైనా ఆకలితో అలమటిస్తుంటే ఆర్థిక ఇబ్బందులు ఉంటే మనకు తోచినంత మనం సహాయం చేయాలి అలాంటప్పుడు ఇలాంటి సంఘటనలను మనం అడ్డుకోవచ్చు అన్నారు.

**కుటుంబానికి అండగా నిలిచిన షబ్బీర్ అలీ**

బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందిస్తూ ఆయన పలు హామీలు ఇచ్చారు.బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఆ తల్లికి జీవనోపాధి కోసం కాంట్రాక్ట్ ఉద్యోగం కల్పిస్తానని హామీ ఇచ్చారు. నిందితుడికి కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా ఒక మనిషిగా,ఒక తండ్రిగా స్పందించిన షబ్బీర్ అలీ తీరు కామారెడ్డి ప్రజలను కదిలించింది. ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించే నాయ కుడు ఉండటం మా అదృష్టం అంటూ స్థానికులు ఆయనను ప్రశంసిస్తున్నారు.

# పదవ విద్యార్థుల వీడ్కోలు సమావేశం



చండూరు తెలంగాణ పత్రిక మార్చి 10

చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె. కోటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి పూర్తి స్థాయిలో కృషిచేసినట్లయితే... ఉత్తమ ఫలితాలు వస్తాయని చెప్పారు, మండల విద్యాధికారి ఊటుకూరి సుధాకర్ రెడ్డి, మాట్లాడుతూ ఉపాధ్యాయుల శ్రమకు పదవ తరగతి ఫలితాలు గీటురాయిగా నిలుస్తాయని అన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, కానుకలు అందజేసి పదవ తరగతి విద్యార్థులకు, 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, బి. సైదులు, సతీశ్, గిరి, జి కరుణాకర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులతో కదిలిన యంత్రాంగం

భిక్కనూరు మార్చి 10 ( తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి )


మండలంలోని ప్రతిపాదిత పరిశ్రమల ఏర్పాటుపై స్థానికుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గత కొద్ది రోజులుగా పెద్దమల్లారెడ్డి, కాచాపూర్ గ్రామస్తులు తమ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకిస్తూ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో వరుసగా ఫిర్యాదులు అందజేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం అధికారుల బృందం విచారణకు వచ్చినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

**రహస్యంగా అధికారుల విచారణ?**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులు మంగళవారం భిక్కనూరు మండలానికి చేరుకున్నట్లు సమాచారం. అయితే, ఈ విచారణపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడకపోవడం గమనార్హం. సాధారణంగా విచారణ జరిగేటప్పుడు ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, తమకు ఎలాంటి ముందస్తు సమాచారం అందలేదని బాధితులు పేర్కొంటున్నారు.

**జనవరి 07 ప్రజాభిప్రాయ సేకరణ నివేదికపై ఉత్కంఠ**

గత జనవరి 07వ తేదీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నివేదిక ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆ రోజు ప్రజల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలన్నీ ప్రజలకే అనుకూలంగా ఉన్నట్లు వినికిడి. ఈ అధికారిక నివేదిక వెలువడితేనే పరిశ్రమల భవితవ్యంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




**గందరగోళంలో ప్రజలు.. చర్చల్లో గ్రామాలు**

"లోపల ఏం జరుగుతోంది?" అనే ప్రశ్న ఇప్పుడు భిక్కనూరు మండల ప్రజలను వేధిస్తోంది. ఒకవైపు విచారణ జరిగినట్లు వార్తలు వస్తుంటే, మరోవైపు తమను సంప్రదించలేదని ఫిర్యాదుదారులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. పరిశ్రమల ఏర్పాటు విషయంలో తెరవెనుక ఏదో జరుగుతోందన్న చర్చ గ్రామాల్లో ఊపందుకుంది. అధికారులు తమ విచారణ నివేదికను పారదర్శకంగా బయటపెట్టాలని, స్థానిక ప్రజల ప్రయోజనాలను కాపాడాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 10

మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతికి ఎంతో కీలకమైన పరీక్షలు కావడంతో నిర్వహణలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. పరీక్షా



కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బి సెక్షన్ అమలు, జిరాక్స్ కేంద్రాలపై నియంత్రణ వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాల విషయంలో అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, డి పి ఓ సుధీర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన

**- సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య**

కోదాడ, మార్చి 10 (తెలంగాణ పత్రిక):

గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని గ్రామ సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య అన్నారు. మండల పరిధిలోని గణపవరం గ్రామ సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య ప్రజా పాలన కార్యక్రమానికి ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ రాంబాబుని గ్రామానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అధికారులతో కలిసి గ్రామంలో ఉన్న పలు ముఖ్యమైన పనులను పరిశీలించారు. త్వరలో జరగనున్న శ్రీ వర వర రంగనాయక స్వామి వారి కళ్యాణం మహోత్సవ కార్యక్రమానికి కావలసిన వాటర్ ఫెసిలిటీ, రవాణా సౌకర్యాలు, శాంతి భద్రతలు, హెల్త్ క్యాంప్, గురించి అధికారుల ను అభ్యర్థించడం జరిగింది. అదేవిధంగా గ్రామంలో ఉన్న నర్సరీ, హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి అక్కడి బోధనా విధానం 10వ తరగతి విద్యార్థుల పరీక్షల సిద్ధత గురించి టీచర్లను అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించారు. గ్రామంలోని వెటర్నరీ ఆసుపత్రి నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి అక్కడి సేవల పరిస్థితిని తెలుసుకున్నారు. మహిళల సాధికారత కోసం గ్రామంలో ఎస్ హెచ్ జి పొదుపు సంఘాల మహిళల కోసం నిర్మించబడుతున్న మీటింగ్ హాల్ పనుల గురించి సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య అధికారులకు వివరించారు. తదుపరి గ్రామ పంచాయతీ కార్యాలయం



లో జరిగిన సమావేశంలో గ్రామంలో ఉన్న వివిధ సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రజల అవసరాల గురించి సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య అధికారులకు సమగ్రంగా వివరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం గణపవరం గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తోంది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవిత రెడ్డి, ఏఎన్ఎం విజయలక్ష్మి, జిపిఓ అన్నపూర్ణ, 9వ వార్డు మెంబర్ బండి చిన కోటయ్య, కాసాని శ్రీను, పోశం శ్రీను, కొండ ధనమూర్తి, బలుగూరి నాగస్వరప్, ఇర్ల నర్సిరెడ్డి, శ్యామకురి గురవయ్య, జంగం గాంధీ, అమరబోయిన లక్ష్మయ్య, పోశం కృష్ణయ్య, శెట్టి అప్పారావు, పిడమర్తి పుల్లయ్య గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వేణారెడ్డి సేవలు అభినందనీయం

**- ఎఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి**

తెలంగాణ పత్రిక ,సూర్యాపేట మార్చి 10



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొప్పుల వేణారెడ్డి రైతులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి సంవత్సరం కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మార్కెట్ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేధిత లక్షాదిలతో కలిసి వేణారెడ్డితో పాటు డైరెక్టర్లను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంతో పాటు తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల నుండి వచ్చే రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పాలకవర్గం ఉత్తతమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా కొప్పుల వేనారెడ్డి పదవి చేపట్టిన వెంటనే ఐదు రూపాయలకు అన్నపూర్ణ భోజనంతోపాటు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మార్కెట్ కు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఉచితంగా ప్రతిరోజు అల్పాహారం కూడా పంపిణీ చేయించడం గర్వకారణమన్నారు. రానున్న రోజుల్లో ఎన్నో ఉన్నతమైన పదవులు అలంకరించి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ముక్రం, డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ సందర్శించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి , మార్చి 10,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

త్రైమాసిక తనిఖీలో భాగంగా మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ విక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి గోదాంలో భద్రపరిచిన ఈవీఎం యంత్రాల భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు భద్రతా నిబంధనల అమలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదాంలో ఉన్న రికార్డులను పరిశీలించి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రతపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత అధికారులు నిబంధనలను పూర్తిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవోవీణ, ఎమ్మార్వో హిమబిందు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# రెడ్యా తండాలో సీసీ రోడ్ల ఏర్పాట్లు

**- సర్పంచ్ రమేష్ నాయక్**

ఊర్కొండ మార్చి 10(తెలంగాణ పత్రిక)



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం గుండ్లగుంటపల్లి గ్రామాన్ని అభివృద్ధి పరచడమే తన లక్ష్యమని గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్ అన్నారు. గుండ్లగుంటపల్లి గ్రామ పంచాయతీ ఆవాస ప్రాంతమైన రెడ్యాతండాలో మంగళవారం సిసి రోడ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజా ప్రభుత్వమని ప్రజా ప్రభుత్వంలో ప్రతి పల్లెలో ప్రజా అవసరాల నిమిత్తం అంతర్గత వీధి రోడ్లను సిసి రోడ్లుగా మార్చడమే మా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహకారంతో మండలాలు ,గ్రామాలు మరింత అభివృద్ధి పథంలో ముందు ఉన్నాయని, ప్రత్యేకంగా ఊర్కొండ మండలానికి అభివృద్ధి పథంలో పెద్దపీట వేస్తున్నారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించడానికి కష్టపడి చదవాలి

**- విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి**

**- ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి**





ఊర్కొండ మార్చి 10(తెలంగాణ పత్రిక)

నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేటలో విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించ డానికి నిరంతరం శ్రమించాలని మండల ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, మంచి క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలని అన్నారు. పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించడానికి కష్టపడి చదవాలని, భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. పాఠశాల జ్ఞాపకాలను, ఉపాధ్యాయుల మార్గదర్శకాలను గుర్తుంచుకుని, సమాజంలో మంచి పౌరులు గా ఎదగాలని చెప్పారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో విజయం సాధించాలని, తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. బాలుర బీసీ హాస్టల్ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో సమస్యల గురించి మాట్లాడారు. అనంతరం గ్రామ పంచాయతీలో పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. తదుపరి గ్రామ పంచాయతీ పాలకమండల సభ్యులు ఎంపీడీవోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అబ్దుల్ రషీద్, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రహీం, ఎంపివో లక్ష్మణ్ నాయక్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పై కేసు నమోదు. ఎస్సై నవీన్ కుమార్.



అనంతగిరి, మార్చి 10(తెలంగాణ పత్రిక):

అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్ల పై కేసు నమోదు మంగళవారం జగ్గయ్యపేట సమీపంలో గల మల్కాపురం వాగు నుండి మాతంగి కోటి, డ్రైవర్ గోగుల నాగయ్య, లింగబోయిన రమేష్, అతని డ్రైవర్ ఆంబోజు ప్రవీణ్ లు ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను దొంగతనంగా తమ యొక్క ట్రాక్టర్లలో తరలిస్తుండగా తమరబండపాలెం గ్రామ శివారులో గల గొండ్రియాల రోడ్డున గల బైపాస్ వద్ద పట్టుబడి చేసి ఆ రెండు ట్రాక్టర్లు ఏపీ- 24 టిసి-5429,- ఏపీ 20-ఏపీ 7349 లపై కేసులు నమోదు చేసినట్లుగా అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

## వేసవికి మందు కండ్ గా వ్ గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు సర్పంచ్ సునీత



తెలంగాణ పత్రిక ప్రేస్ రిపోర్టర్ మోహన్. బోధన్ మండలం. మార్చ్.10..

నిజాంబాద్ జిల్లా బోధన్ మండలం ఖండ్ గావ్ గ్రామ సర్పంచ్ సునీత తమ గ్రామ ప్రజలకు నీటి సమస్య రాకుండా ముందుగానే చర్యలు 1.4.5. వార్డుల లో నీటి ఎద్దడి సమస్య రాకుండా కొత్తగా బోర్లు వేయించి నీటి సమస్య తీర్చారు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా ఖండగవ్ సర్పంచ్ సునీత గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తీర్చినందుకు గ్రామ ప్రజలు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇతర గ్రామ ప్రజలకు మా గ్రామ సర్పంచ్ ఆదర్శమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## డీలర్ కు పురుగుల మందులు అమ్మకూడదని నోటీసులు జారి

కథలాపూర్ తెలంగాణ పత్రిక మార్చి 10



కథలాపూర్ మండలంలోని రెండు ఎరువుల దుకాణాలలో మండల వ్యవసాయ అధికారి యోగిత తనిఖీ చేయడం జరిగింది చింతకుంట గ్రామంలోని రేణుక ఫర్టిలైజర్, సిరికొండ గ్రామంలోని దుర్గా ఫర్టిలైజర్ లో పెస్టిసైడ్ నిలువలను తనిఖీ చేయడం జరిగింది. అందులో భాగంగా రేణుక ఫర్టిలైజర్ డీలర్ నాగం ప్రవీణ్ దుకాణంలో సరియైన రిజిస్టర్లు, పీసీలు, స్టాక్ బోర్డ్, ప్రైస్ బోర్డ్ లేనందున మరియు లైసెన్స్ లో ఆమిట్మెంట్ లేనందున మొత్తం స్టాక్ నిలువలను 15 రోజుల వరకు స్టాఫ్ సేల్ ఇవ్వడం జరిగింది ఎరువుల దుకాణంలో సరిగ్గా రూల్స్ ప్రకారం నిర్వహించడం లేనందున డీలర్ నాగం ప్రవీణ్ ను మందలిస్తూ వెంటనే సెలెక్ట్ చేసుకోవాల్సి తెలియజేయడం జరిగింది అదేవిధంగా దుర్గ ఫర్టిలైజర్ నందు అన్ని విధముల పీసిలు, లైసెన్సులు, స్టాక్ బోర్డ్, బిల్ బుక్స్, సక్రమంగా ఉన్నందున డీలర్ లక్ష్మీకాంతం అభినందిస్తూ అందరూ డీలర్లు ఇలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు

## పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

ఊర్కొండ మార్చి10( తెలంగాణ పత్రిక)



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మూగజీ వాలైనా పశువులకు ఉచిత గాలి కుంటు నివారణ టీకాలు మంగళవారం మండల పరిధిలోని గుడిగాన్ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ రుక్మరెడ్డి , మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ రైతులందరూ సకాలంలో పశు వులకు గాలి కుంటూ వ్యాధులు రాకుండా నివారణ నివారణ చర్యలకు కోసం ఈ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు వేయడం వలన వ్యాధి నుంచి రక్షించుకోవడమే కాకుండా పశు వులు ఆరోగ్యంగా ఉండి పాల దిగుబడి పెరుగుతుందని అన్నారు. గ్రామంలో 278 పశువులకు నివారణ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలల్లో ఈ నెల 10 నుంచి ఏప్రిల్ 9 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు . మండలంలోని అన్ని గ్రామాలలోని పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో, పశు వైద్య సహాయ సిబ్బంది ,గ్రామ వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. కలెక్టర్





- డ్రైనేజీలను శుభ్రపరచడం రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య పనులు చేపట్టాలి
- పట్టణాన్ని శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసి పని చేయాలి
- బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఎగ్జామ్ కిట్టు పంపిణీ
- పదవ తరగతి విద్యార్థులకు మంచి మార్కులు తెచ్చుకోవాలని, ప్రతి సబ్జెక్టు నూటికి 70% మార్కులు రావాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

కోదాడ, మార్చి 10(తెలంగాణ పత్రిక):

99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 21 వార్డుల్లో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, మున్సిపల్ చైర్ పర్సన్ కుసుమ కుమారి, రెవెన్యూ డివిజనల్ అధికారి సూర్య నారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వైస్ చైర్ పర్సన్ మల్లీశ్వరి, కౌన్సిలర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలు కలిసి పనిచేయాలని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్ కట్ట శ్రీ సాయి భవాని మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల సందర్శించి కిచెన్ షెడ్డు, టాయిలెట్స్ వంటశాల, కంప్యూటర్ రూమ్, స్కూలుకు సంబంధించిన బిల్లులు ఆన్లైన్లో ఎలా చేస్తారు అని అడిగి తెలుసు కున్నారు 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ. మంచి మార్కుల తెచ్చు కోవాలని,ప్రతి సబ్జెక్టులో నూటికి 70 శాతం మార్కులు రావాలని కలెక్టర్ కోరారు. విద్యార్థినులకు ఎగ్జామ్ కిట్టు పంపిణీ చేశారు. రెవెన్యూ డివిజన్ అధికారి, తహసిల్దార్ కార్యాలయంలను తనిఖీ చేసి పెండింగ్ ఫైల్స్ క్లియర్, త్రాగునీరు, విద్యా, వైద్యం పై వచ్చిన దరఖాస్తులు 10 రోజులలో క్లియర్ చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ తహసిల్దార్ వాజిద్, ఎంఈఓ సలీం, ప్రధానోపాధ్యాయులు సుశీల భాయ్, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యా యులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం వలన రోగాలు రాకుండా నివారించవచ్చు

- సర్పంచ్ అబ్దుల్ రషీద్

ఊర్కొండ మార్చి 10(తెలంగాణ పత్రిక)



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఊర్కొండపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు పరిసర ప్రాంతాలలో , గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులు, మహిళా సంఘాల నాయకురాలు, గ్రామ మహిళలతో ,వార్డు సభ్యులు, తనూ సైతం చీపురు పట్టి పరిసర ప్రాంతాలను ప్రభుత్వ కార్యాలయాల ముందు, వీధులను శుభ్రపరచారు. అనంతరం మురుగు నీరు నిలిచిన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలలో మురుగు కాలువలు ఎప్పటికప్పుడు మురుగు నీరు నిలవకుండా చూసుకొని దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లయితే విష జ్వరాల బారిన పడకుండా ఉంటామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు గ్రామాల సమగ్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, ఉప సర్పంచ్ శ్రీనివాస్ ,వార్డు సభ్యులు, మహిళా సంఘాల నాయకులు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## కార్మికులకు ఉరితాళ్లుగా మారే నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా హెడ్ ఆఫీస్ ముందు ధర్నా

కొత్తగూడెం ఆర్సి మార్చి 10 తెలంగాణ పత్రిక




కొత్తగూడెం: కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో సింగరేణి కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఐఎఫ్టీయూ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మార్చి 16న జరగనున్న "చలో కలెక్టరేట్" మరియు మార్చి 23న హైదరాబాద్ లేబర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం కొత్తగూడెంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏరియా నాయకుడు కామ్రేడ్ కరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరావు, కొత్తగూడెం ఏరియా కార్యదర్శి ఎన్.సంజీవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని విమర్శించారు. కార్మికులు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న హక్కులను రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1 నుండి ఈ కోడ్లను దేశవ్యాప్తంగా అమలు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని గంటలను 12 గంటలకు పెంచడం, కనీస వేతనాలను జీవన ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణయించకపోవడం వంటి అంశాలు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తాయని అన్నారు. ఈ కోడ్లు కార్మికులను కట్టుబానిసలుగా మార్చే విధంగా ఉన్నాయని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో నరసింహ, రామకృష్ణ, పాషా, కరుణ, సంధ్య, హుస్సేన్, బి.లక్ష్మి, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చదువున్నా అందని ఉపాధి.. కన్నీరు మున్నీరవుతున్న వికలాంగుడు ఓదెల నరేష్: ఆదుకోవాలని వేడుకోలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 10, తెలంగాణ పత్రిక



చదువున్నా అందని ఉపాధి.. కన్నీరు మున్నీరవుతున్న వికలాంగుడు ఓదెల నరేష్ డిగ్రీ మరియు ఐటీఐ వంటి ఉన్నత చదువులు చదివినా, విధి వంచించి అంగవైకల్యం తోడవ్వడంతో ఒక నిరుపేద యువకుడు బతుకు పోరాటంలో అల్లాడిపోతున్నాడు. వేములవాడ పట్టణంలోని ఒక అద్దె ఇంట్లో నివసిస్తున్న ఓదెల నరేష్ అనే దివ్యాంగుడి కథ ఇది.

**కుటుంబ భారం..తీరని కష్టాలు**

నరేష్ తల్లిదండ్రులు వృద్ధాప్యం మరియు అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమయ్యారు. ఒక్కగానొక్క కొడుకుగా వారిని పోషించాల్సిన బాధ్యత నరేష్‌పై పడింది. కానీ, అంగవైకల్యం కారణంగా బయట పనులు చేయలేక, అద్దె కట్టలేక, పూట గడవడమే కష్టంగా మారిందని ఆయన కన్నీరు మున్నీరవు తున్నారు. అప్పుల బాధలు చుట్టుముట్టడంతో కుటుంబం రోడ్డున పడే స్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు ఏదైనా ఉపాధి కల్పించాలని నరేష్ 2015 నుండి కలెక్టర్ కార్యాలయం, వేములవాడ మరియు కొండగట్టు దేవస్థానా ల్లో లెక్కలేనన్ని దరఖాస్తులు చేసుకున్నారు. అయినప్పటికీ, నేటికీ ఏ అధికారి గానీ, ప్రభుత్వం గానీ కనికరించలేదని ఆయన వాపోతున్నారు. చదువుకు తగ్గ ఉద్యోగం లేకపోయినా, కనీసం బ్రతకడానికి ఏదైనా చిన్న ఉపాధి కల్పించాలని ఆయన వేడుకుంటున్నారు. "ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి నాకు ఏదైనా ఉద్యోగ అవకాశం లేదా స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందించి నా కుటుంబాన్ని ఆదుకోవాలి. లేదంటే మా కుటుంబానికి చావే శరణ్యం" అని నరేష్ ఆవేదనతో చెబుతున్నారు. నరేష్ గారి లాంటి ప్రతిభావంతులైన దివ్యాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత సమాజం మరియు ప్రభుత్వంపై ఉంది. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఉప్పు లింగాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 ట్రాక్టర్ల ఇసుక డంపు సీజ్





**– ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం**

**– వెల్దుర్తి తాసిల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు**

వెల్దుర్తిమండల ప్రతినిధి, మార్చ్ 10 (తెలంగాణ పత్రిక):

ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేకుండా, ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్దుర్తి తహసిల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పు లింగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక డంపులు నిల్వ ఉంచారంట సమాచారంతో తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా నిర్వహించిన 50 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఎవరైనా అక్రమ రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా నిరుపేదలు ఉంటే ముందస్తుగా దరఖాస్తు చేసుకుంటే వారికి ప్రభుత్వం నుండి ఇసుక ఇచ్చేందుకు అనుమతి ఇస్తామని, ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

# తాహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





మెదక్ జిల్లా. చిన్న శంకరంపేట మార్చ్ 10 (తెలంగాణ పత్రిక )

చిన్నశంకరంపేట ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో 99 రోజుల లో భాగంగా మంగళవారం చిన్న శంకరంపేట తాహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని తాహసిల్దార్ మాలతీని కార్యాలయంలోని పరిపాలన గురించి అడిగి తెలుసుకున్నారు. క్లియరెన్స్, రికార్డ్ గదిలోకి వెళ్లి ఫైళ్లను పలు రికార్డులను పరిశీలించారు. భూ భారతి కి సంబంధించిన పట్టా మార్పిడి పట్టాలను తదితర ధ్రువ పథకాలను పరిశీలించారు. భూ భారతిలో రైతులకు సంబంధించి మార్పు చేర్పులు గురించి తెలుసుకున్నారు. కార్యాలయం పాత బడిందని మరమ్మత్తుల నిమిత్తం నివేదిక రాసి పంపాలని గదులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చిన్న చిన్న పొరపాట్లు ఉన్నాయని అవి తొందర్లోనే సరి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఆ తర్వాత మండల కేంద్రంలోని మూడో నెంబర్ అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడి టీచర్ రాణి కి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ మాలతీ, ఇన్స్పెక్టర్ రాజు. వినయ్. సిబ్బంది ఉన్నారు.

# డ్రగ్స్‌ను అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దు






**– ఈగల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్**

దేవరుప్పుల, మార్చి 10 (తెలంగాణ పత్రిక):

డ్రగ్స్ ను అలవాటు చేసుకుని తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని ఈగల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్ తెలంగాణ ప్రభుత్వం భాగంగా పిల్లల భద్రత డ్రగ్స్ అడ్డుకట్ట అనే కార్యక్రమం ఈగల్ ఫోర్స్ తెలంగాణ, దేవరుప్పుల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరుప్పులలో పలు పాఠశాలల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈగల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్, పాలకుర్తి సిఐ జానకిరామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు మంచి భవిష్యత్తు ఉందని, డ్రగ్స్ కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. పిల్లలు చెడు దారిన వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత కూడా తల్లిదండ్రులపై ఉందన్నారు. పాఠశాల, కళాశాలలకు వెళుతున్న విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రతినిత్యం ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. అనంతరం పలు పాఠశాలల్లో కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో దేవరుప్పుల పోలీస్ సిబ్బంది దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి, ఉప సర్పంచ్, డిప్యూటీ తహసిల్దార్ ఎంపీ ఓ, ఏవో, మెడికల్ ఆఫీసర్, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు, డి ఆర్ సి సి సెంటర్ మరియు కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్





జగిత్యాల, మార్చి 10, (తెలంగాణ పత్రిక):

జగిత్యాల పట్టణంలోని నర్సింగపూర్ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లో ఇటీవల తరచూ మంటలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అక్కడికి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌తో పాటు డి ఆర్ సి సి సెంటర్ మరియు కంపోస్ట్ యార్డ్‌ను కూడా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తడి చెత్త మరియు పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందిస్తే తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పొడి చెత్తను డి ఆర్ సి సి సెంటర్ ద్వారా రీసైక్లింగ్‌కు పంపించడం సులభంగా జరుగుతుందని తెలిపారు. అయితే ప్రజలు చెత్తను పూర్తిస్థాయిలో వేరు చేసి ఇవ్వకపోవడం వల్ల చెత్తను అలాగే డంప్ చేయాల్సి వస్తోందని, దాంతో డంపింగ్ యార్డ్‌లో తరచూ మంటలు చెలరేగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు మున్సిపాలిటీకి సహకరించి చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని, మున్సిపల్ కార్మికులకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ పాలకవర్గం తరఫున వార్డు వార్డుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చెత్త వేరు చేయడం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, అందరం కలిసి జగిత్యాల మున్సిపాలిటీని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం స్పందన, టీపీఓ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్లు లత, రాము, ఈఈ శ్రీకాంత్ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో మెగా వైద్య శిబిరం



గంభీరావుపేట తెలంగాణ పత్రిక మార్చి 10

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లోనీ లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా లింగన్నపేట గ్రామం నందు మెగా వైద్య శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లింగన్నపేట గ్రామ సర్పంచ్ పిట్ల ఎల్లయ్య ఉప సర్పంచ్ అబ్బరవేణి నరసింహులు వార్డు సభ్యులు పాల్గొన్నారు వివిధ రకాల డాక్టర్లు ఆర్తో గైనిక్ ఆప్తాం పీడియాట్రిక్ డెంటల్ జనరల్ మెడిసిన్ డాక్టర్లు మొత్తం 335 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు 126 మందిని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు ఈ కార్యక్రమంలో లింగన్నపేట వైద్యాధికారి డాక్టర్ అభినయ్ ఎమ్మార్వో మారుతిరెడ్డి సి హెచ్ ఓ రమేష్ తోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గౌడ కుల ప్రజాప్రతినిధులకు సన్మానం





తెలంగాణ పత్రిక మార్చి 10

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీమాతా అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ కులానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జల రాజశేఖర్, కొయ్యడ రాజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుకూరి గోవర్ధన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సమాజం ఐక్యతతో ముందుకు సాగి రాజకీయ, సామాజిక రంగాలలో అభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేరెళ్ల విజయ్, ఓల్లాల రజిత, వెంకటేష్, మాజీ సర్పంచ్ జితేందర్ గౌడ్, ఉప సర్పంచ, గడ్డమీది పరుశురాం, అనగోని అభిలాష్ గౌడ్, ముత్యం బాల గౌడ్, బండారి నరేష్, నాయకులు ముత్యం అమర్, గౌడ్ మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, కొయ్యడ భాస్కర్ రిపోర్టర్ దేవేందర్ ,గౌడ్, బండారి శ్రీనివాస్ గౌడ్ , నాయిని తిరుపతి గౌడ్ కొమిరె లక్ష్మణ్ గౌడ్, వివిధ గ్రామాల వార్డ్ సభ్యులు, మండల గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జయక్రిష్ణ (చారి హాస్పిటల్ మెదక్ వారిచే)ఉచిత వైద్య శిబిరం




మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మార్చ్ 10 (తెలంగాణ పత్రిక)

చిన్న శంకరంపేట మండలం ఖాజాపూర్ లో జయక్రీష్ణ (చారి హాస్పిటల్ మెదక్) వారిచే. ఉచిత మెగా వైద్య శిబిరం. ఖాజాపూర్ గ్రామంలో మంగళ వారం నిర్వహించారు. డాక్టర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం కంటి చూపు. బిపి. షుగర్ వ్యాధి. జలుబు జ్వరం.లాంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు వైద్య బృందం మాట్లాడుతూ. మెదక్ లో గల జయకృష్ణ హాస్పిటల్ లో ప్రతి మంగళవారం మరియు శుక్రవారం. షుగర్ వ్యాధికి.ఎఫ్ బి ఎస్. పి బి ఎస్. ఆర్ బి ఎస్. లాంటి పరీక్షలు ఉచితంగా చేయబడుతుందని.వారు తెలిపారు. గ్రామ సర్పంచ్ మన్నె బాలస్వామి. జయ కృష్ణ (చారి హాస్పిటల్) వారికి మరియు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలకు విద్యార్థులకు దాహం తీరుస్తున్న బల్జిసింగ్ వాల్మీకి సమాజ్..




తెలంగాణ పత్రిక ప్రెస్ రిపోర్టర్ మోహన్ బోధన్ మండలం మార్చి 10..



నిజాంబాద్ జిల్లా బోధన్ మండలంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాల్మీకి సమాజ్ చెందిన బల్జి సింగ్ అనే వ్యక్తి వేసవి కాలాన్ని గుర్తించి గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలకు మరియు విద్యార్థులకు తన సొంత ఖర్చులతో తాగునీటిని నిత్యం ప్రజలకు గ్లాసుల ద్వారా అందిస్తున్నారు వేసవికాలం పూర్తయ్యే వరకు ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తారని తన మాటల్లో చెప్పడం జరిగింది. బోధన్ మండలంలో మున్సిపాలిటీలో ఒక చిరు ఉద్యోగిని కాబట్టి వేసవి కాలనీ గుర్తించి ప్రజలకు మరియు విద్యార్థులకు దాహం తీరుస్తానా నీ అలాగే పల్లెటూరు నుంచి పట్నంకు వచ్చే ప్రతి ఒకరి కీ నేను నీటి దాహం తీరుస్తానని తన వంతు.బాధ్యతగా తను మనస్ఫూర్తిగా ప్రజలకు నీ టి దాహం తీరుస్తానని ఆయన అన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో కాలువల శుభ్రత పనులు

- పనులను పరిశీలించిన కంచర్ల జమలయ్య



కొత్తగూడెం ఆర్సి మార్చి 10 తెలంగాణ పత్రిక

కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఐదవ రోజు పంజాబీగడ్డ 18వ డివిజన్‌లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం, పశువుల ఆసుపత్రి పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, పిచ్చి చెట్లను తొలగించడం వంటి పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫారెస్ట్ రేంజర్ కార్యాలయం ముందు ఉన్న చెట్లను కూడా తొలగించారు. కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హేమాశ్రీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య పాల్గొని పనులను పరిశీలించారు. అదేవిధంగా 18వ డివిజన్ వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది కూడా పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కార్పొరేటర్ హేమాశ్రీ కోరారు.

## పీ ఎన్ జీ గ్యాస్ పైప్ లైన్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి.



కోదాడ, మార్చి 10(తెలంగాణ పత్రిక):

పీ ఎన్ జీ ఆర్ బి 2.0 డ్రైవ్ లో భాగంగా కోదాడ పట్టణ గోపిరెడ్డి నగర్ లో ఇంటింటికి పైప్ లైన్ ద్వారా గ్యాస్ సప్లై చేయడానికి స్మార్ట్ మీటర్ ద్వారా ఏర్పాటు చేసినటువంటి ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. (ఎల్ పి జి )తో పోలిస్తే పైప్ లైన్ గ్యాస్ ధర తక్కువ మరియు ప్రమాదాలు జరగడానికి వీలు లేకుండా అందరికి ఉపయోగ కరంగా ఉంటుంది అని ఆమె అన్నారు.ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాను రాను నియోజకవర్గం మొత్తం ఇదే విధంగా పైప్ లైన్ గ్యాస్ సప్లై కి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇట్టి కార్యక్రమంలో మెగా గ్యాస్ కంపెనీ మేనేజ్మెంట్, మరియు వార్డ్ కౌన్సిలర్లు, స్థానిక వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ టైగర్ కామ్రేడ్ ఓంకార్ శత జయంతి ఉత్సవాలు

- విజయవంతం చేయాలి
- ములుగు జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి మార్చి 10 తెలంగాణ పత్రిక


ఎం సి పి ఐ యూ పార్టీ ములుగు జిల్లా కేంద్రంలో కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎం సిపిఐ యు ములుగు జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు వీర రైతాంగ సాయుధ పోరాట యోధుడు మద్ది కాయల ఓంకార్ ఆయన పుట్టి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంలో మార్చి 17న హైదరాబాద్ రాజధాని రవీంద్ర భారతిలో సభ జరుగుతున్నది. ఆదివాసీలు రైతులు కార్మికులు బహుజనులు విద్యార్థులు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ములుగు జిల్లా కమిటీ కోరుతూ వాల్ పోస్టర్ విడుదల చేయడమైనది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కార్యదర్శి గుండెబోయిన



చంద్రయ్య సభ్యులు రాస రాజన్న ఎస్.కె రఫీ మాదాసు ఆదిరెడ్డి అయితే సూరయ్య సరూప పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధుల శిక్షణను విజయవంతం చేయాలి



- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 10

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమావేశమై ఈ నెల 12వ తేదీన ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడిందని తెలిపారు. ఈ కార్యాచరణను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లకు జిల్లా కేంద్రాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలులో ప్రజా ప్రతినిధులు నిర్వర్తించాల్సిన బాధ్యతలు, పాత్రపై అవగాహన కల్పించాలి అని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజా ప్రతినిధులు తీసుకోవాల్సిన చర్యలపై కూడా వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, మున్సిపల్ చట్టాలపై కూడా ప్రజా ప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించాలని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్ల సహాయంతో సులభంగా అర్థమయ్యే విధంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుకు శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీలు, పట్టణ ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభించినట్లు చెప్పారు. ఈఆఫీస్ విధానంలో పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో త్రాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను దశల వారీగా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిపిఓ సుధీర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, మున్సిపల్ కమిషనర్లు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ





- మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్

జగిత్యాల, మార్చి 10, (తెలంగాణ పత్రిక ):

జగిత్యాల పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం 14వ వార్డులో చేపట్టిన పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాని శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రధాన రహదారులు, కాలువలు, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న శుభ్రత కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. పారిశుధ్య పనులు చేపడితే అవి పూర్తి స్థాయిలో నిర్వహించాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా క్రమం తప్పకుండా శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల వద్ద చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన విధానం ప్రకారం తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు మాత్రమే ఇవ్వాలని కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమం లో 14వ వార్డు కౌన్సిలర్ బొల్లరపు స్వప్న గిరిధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు లత, రాము, ఈఈ శ్రీకాంత్, వార్డు అధికారి ప్రణయ్, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వినమ్ర నివాళి



- మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల ప్రతినిధి, మార్చి 10 (తెలంగాణ పత్రిక ):

గొప్ప మహిళా సంఘ సంస్కర్త, ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయ్ పూలే గారి వర్ధంతి సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆమెకు వినమ్ర నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల విద్య, సమాన హక్కుల కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం భారతదేశ సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. మహిళలు చదువుకోవడం కూడా సమాజంలో వ్యతిరేకత ఎదుర్కొన్న కాలంలో, అనేక అవమానాలు, అడ్డంకులు ఎదురైనా ఆమె వెనుదిరగకుండా మహిళల విద్యాభివృద్ధికి మార్గం చూపిందని తెలిపారు. స్త్రీల విద్యకు పునాది వేసి, సమాజంలో మహిళలకు గౌరవప్రదమైన స్థానం కల్పించేందుకు ఆమె చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న నేపథ్యంలో సావిత్రిబాయి పూలే ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె పోరాటస్ఫూర్తిని స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది

**- మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**

జగిత్యాల ప్రతినిధి, మార్చి 10 (తెలంగాణ పత్రిక ):

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజల సమస్యల పరిష్కారానికి దోహదపడే మంచి కార్యక్రమమని జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పేర్కొన్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ఐదు దశల్లో 99 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆమె అభినందించారు. ప్రజాపాలన లక్ష్యం నెరవేర్చే దిశగా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. జిల్లాల వారీగా మెగా జాబ్ మేళాలు నిర్వహించి లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం యువతకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అలాగే ఇందిరా మహిళాశక్తి భవనాలు ప్రారంభించడం ద్వారా మహిళలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం, నిరంతరంగా రేషన్ కార్డులు అందించడం వంటి నిర్ణయాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం 10 వారాల పాటు వారానికో విభాగంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం మంచి ముందడుగు అని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి వేగం పెరిగి ప్రజలకు మరింత మేలు జరుగుతుందని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.



# యువత నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రపంచంతో పోటీపడాలి





**- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

జగిత్యాల ప్రతినిధి, మార్చి 10, తెలంగాణ పత్రిక ):

నేటి యువతే దేశానికి అమూల్యమైన సంపద అని, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతను నేర్చుకుని ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి సంప్రదాయ మూస పద్ధతిలో కాకుండా వైవిధ్యంగా ఆలోచించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసించాలని సూచించారు. అలా చేస్తేనే యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల పట్టణంలో రూ.36 కోట్ల వ్యయంతో అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ (ఏటీసీ) ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐటీఐ నాక్ కేంద్రానికి సుమారు ఒక కిలోమీటర్ దూరంలో ఈ ఏటీసీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. యువత ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో టాటా గ్రూప్ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. యువత ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న కోర్సులను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏటీసీ కేంద్రాల్లో విద్యార్థుల కోసం 15 రోజుల స్వల్పకాలిక కోర్సులను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు.

# ఏమినెంట్ ఎక్స్పోర్ట్స్ స్థాయి అవగాహన సదస్సు





**- మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు**

భిక్కనూరు మార్చి 10 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

భిక్కనూరు మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో "ఏమినెంట్ ఎక్స్పోర్ట్స్ అంతర్జాతీయ స్థాయి టాక్స్"లో భాగంగా శ్రీరామచంద్రుడు సాఫ్ట్వేర్ రంగంలో నిపుణులు మరియు మేటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్ గారిచే విద్యార్థులకు కెరియర్ గేడెన్స్,చాలెంజెస్, ఆత్మవిశ్వాసం పెంపుదల, ప్రపంచీకరణ ఫలితంగా వివిధ రంగంలో వస్తున్న మార్పులు భవిష్యత్తు అవకాశాలు మొదలగు అంశాల పైన వారి ఉపన్యాసం, జీవితంలో లక్ష్యసాధన దిశలో ఏ రకంగా ప్రయాణం చేయాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి రాజగంగారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర విద్యార్థులు, శ్రీ చైతన్య విద్యానికేతన్ విద్యార్థులు, విజ్ఞాన్ హై స్కూల్ విద్యార్థులు సుమారు 300 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు, ఈ క్రమంలో శ్రీరామచంద్రుడు నీ మండల విద్యాధికారి రాజా గంగారెడ్డితో పాటు ఉపాధ్యాయులు కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు,విద్యార్థులు పలు సందేశాలపై నివృత్తి చేసుకున్నారు, ఈ క్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పాడి రైతులు తప్పనిసరి పశువులకు గాలికుంటు వ్యాధి ముందస్తు టీకాలు వేయించాలి

**- గ్రామ సర్పంచ్ పశువుల సునంద**



సర్సంపేట/దుగ్గొండి/ మార్చి 10 తెలంగాణ పత్రిక

ముద్దునూరు గ్రామంలో గేదెలకు ఆవులకు గాలికుంటు టీకాల కార్యక్రమం ప్రారంభించిన సర్పంచ్ పశువుల సునంద సదానందం ఉపసర్పంచ్ మోటు పోతుల శైలజ గాలికుంటు వ్యాధి సోకిన పశువు అధిక జ్వరంతో బాధపడుతుంది కాలి గిట్టలలో నోటిలో పుండ్లు ఏర్పడతాయి కాబట్టి రైతులు అందరూ తప్పనిసరి తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకా వేయించాలి అని పశు వైద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుల సునంద, ఉప సర్పంచ్ మోటు పోతుల శైలజ దుగ్గొండి పశు వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్ గోపాలమిత్ర కుమారస్వామి రైతు సోదరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## సావిత్రి భాయి పూలే వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై నరోత్తం



జహీరాబాద్ ప్రతినిధి మార్చ్ 10(తెలంగాణ పత్రిక )

సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై నరోత్తం ఈ రోజు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి సావిత్రి భాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి వర్ధంతిని జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా వై నరోత్తం మాట్లాడుతూ ఆడబిడ్డల చదువుకోసం వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడిన గొప్ప చైతన్య మూర్తి సామాజిక ఉద్యమకారిణి సావిత్రి భాయి పూలే గారని వారిని స్ఫూర్తిగా తీసుకొని మనమందరం ముందుకు సాగాలని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు స్వామి దాస్ రాచన్న శివ కుమార్ యస్ గోపాల్ జి మల్లేశం భూమ్ రెడ్డి యస్ వెంకట్ చెంగల్ జైపాల్ సంగన్న,యం జైపాల్ శ్రీనివాస్,మేఘనాథ్ లాజర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



ముధోల్: 10మార్చ్(తెలంగాణ పత్రిక)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని ముద్గల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలు ఎండ తీవ్రత బట్టి పనులను త్వరత గతిన పూర్తి చేసుకోవాలన్నారు. పనులు జరిగే చోట అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచే విధంగా చూడాలని సిబ్బందికి సూచించి హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో పెంచుతున్న నర్సరీ మొక్కల పెంపకం పై పలు విషయాలను అడిగితెలుసుకున్నారు. సిబ్బంది మొక్కలకు నీటిని అందించాలని తెలియజేశారు.గ్రామంలో వివో బిల్డింగ్, నూతన గ్రామపంచాయతీ పనులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న రాగి జావా ను ఎంపీడీవో తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట సర్పంచ్ ఆత్మ స్వరూప్ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

ముధోల్: 10మార్చ్(తెలంగాణ పత్రిక)




బైంసా-బాసర జాతీయ రహదారి పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విట్టోలి తాండ నుండి ద్విచక్ర వాహనంపై అవినాష్, అంజలి దంపతులు, ఇద్దరు కుమార్తెలు మహారాష్ట్ర లోని కడికి గ్రామానికి వెళుతుండగా బాసర నుండి బైంసాకు వస్తున్న ఆటో మండల కేంద్రమైన ముధోల్ లోని నయాబాది ఎక్స్ రోడ్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఒకేసారి ఢీ కొట్టింది. దీంతో అవినాష్, అంజలి, పెద్ద కుమార్తె యశస్వి, రెండో కుమార్తె (నాలుగు నెలలు) పాపకు తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు బైంసా ఆసుపత్రికి తరలించగా అవినాష్, ఇద్దరు కుమార్తెలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. భార్య అంజలి ముధోల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈమేరకు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పై కార్యచరణ

**- ఎంపీడీవో చంద్రశేఖర్**




ముధోల్: 10మార్చ్(తెలంగాణ పత్రిక)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పై ఎంపీడీవో చంద్రశేఖర్ కార్యచరణ చేపట్టారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల్లో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, శానిటైజర్, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు తదితర కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. 99 రోజుల్లో గ్రామాల్లో సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం పలు సలహాలు, సూచనలను అందజేశారు. ఈ సమావేశంలో ఏపీవో శిరీష, హౌసింగ్ ఏఈ మనోజ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఖాజాపూర్‌లో శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి పంచమ వార్షికోత్సవం

మెదక్ జిల్లా చిన్న శంకరం పేట మార్చ్ 10 (తెలంగాణ పత్రిక)



చిన్నశంకరంపేట మండలం లోని ఖాజాపూర్ గ్రామంలో నేటి నుండి 14 తేదీ వరకు శ్రీ శ్రీ పెద్దమ్మతల్లి పంచమ వార్షికోత్సవంలో భాగంగా జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. తేదీ 11న బుధవారం ఆలయం వద్ద పందిళ్ళు, గంగ బోనం,తేదీ 12న గురువారం గ్రామ దేవతలకు బోనాలు,ఒగ్గు కథ కాలక్షేపం. తేదీ 13 న శుక్రవారం పెద్దమ్మ తల్లికి పంచ సూక్తులచే అభిషేకం, రుద్ర హోమం, పెద్దిరాజు పెద్దమ్మ కళ్యాణోత్సవం, ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం రాత్రి పెద్దమ్మకు బోనాలు, ఒగ్గు కథ కాలక్షేపం,ఆలయం చుట్టూ బోనాలు తిరుగుట వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.ఇట్టి కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**- మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**



జగిత్యాల, మార్చి 10, తెలంగాణ పత్రిక):

సమాజ సేవలో లయన్స్ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం గొల్లపల్లి మండలం లొత్తునూరు గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాలకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ముఖ్యంగా అంధత్వ నివారణ లక్ష్యంగా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి చికిత్సలు అందించడం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి ఎక్కువ మందికి ఉపయోగపడేలా సభ్యులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీ ఎంసీ తాటిపాముల వినోద్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వడ్లగట్ట శంకర్, ప్రధాన కార్యదర్శి గుండేటి గంగాధర్, కోశాధికారి సామల శ్రీహరి, క్లబ్ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల పట్టణం (తెలంగాన పత్రిక) మార్చ్ 10

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెల ఈవీఎంలను తనిఖీ చేయడం జరుగుతుందని,గోడౌన్‌లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు.గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కలెక్టరేట్ ఏవో హకీమ్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

### కామారంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 పరిశుభ్రత

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మార్చ్ 10 (తెలంగాణ పత్రిక)



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజులలో భాగంగా మంగళవారం చిన్న శంకరంపేట మండలం కామారం తండాలో మురికి కాలువ లను శుభ్రపరచుట రోడ్ల పై చెత్తా చెదారం లేకుండా శుభ్రపరచడం జరిగింది మరియు పిచ్చి మొక్కలను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హలావత్ మోహన్ నాయక్, పంచాయతీ సెక్రటరీ స్వర్ణలత మరియు వార్డ్ మెంబర్స్ పాల్గొన్నారు.

## ఇంధన ధరలు దిగి వస్తాయి

-మొదటిపేజీ తరువాయి

ఇరాన్ విషయంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి చేరువలో ఉన్నామని, ఇరాన్ పై దాడిని, మధ్యప్రాచ్యంలోని చెడును వదిలించడానికి అమెరికా చేసిన విహారయాత్రగా ట్రంప్ అభివర్ణించారు. ఆ విహారయాత్ర స్వల్పకాలికంగానే ఉంటుందని తెలిపారు. మియామి గోల్ఫ్ క్లబ్‌లో రిపబ్లికన్ చట్ట సభ్యులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ప్రసంగించారు. 'ఇరాన్ యుద్ధం ఈ వారంలోనే ముగుస్తుందా' అనే ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ 'లేదు. కానీ త్వరలోనే ముగుస్తుంది' అని జవాబిచ్చారు. 'మా సైనిక లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా పెద్ద అడుగులు వేస్తున్నాం. ఇరాన్‌లోని బలగాలను పూర్తిగా తుడిచిపెట్టేశాం. అంతర్జాతీయ చమురు సరఫరాకు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. అలా చేస్తే ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. మెరికా, ఇజ్రాయెల్‌పై దాడిని పొడిగించేందుకు ఇరాన్‌కు తగినంత సామర్థ్యం లేదు కాబట్టి, యుద్ధం త్వరలోనే ముగిసిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఆయన వారసుడిగా మొజ్తాబా ఖమేనీ ఎంపికైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను ఎంపిక చేయడం పట్ల తాను చాలా నిరాశ చెందానని, అయితే కొత్త సుప్రీం లీడర్ పై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని ట్రంప్ తెలిపారు.

# 12వ తేదీన స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వాలి







**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**- హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 10, తెలంగాణ పత్రిక

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా సర్పంచులు, మున్సిపల్ చైర్మన్, చైర్ పర్సన్, వార్డు సభ్యులకు ఈ నెల 12 వ తేదీన గురువారం శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ పాల్గొనగా.. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే ఉటంకిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు ఏవిధంగా నైతే ప్రామాణికమైన ఫలితాలు అందుతాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు , ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు.శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎం.పీ లు , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లను కూడా ఆహ్వానించాలని స్పష్టం చేశారు. జిల్లా లోని వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపే ఫోటో ప్రదర్శనను కూడా వేదిక వద్ద ఏర్పాటు చేయాలన్నారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ఫైళ్ల క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు కలెక్టర్లను అభినందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. 99 రోజుల కార్యాచరణ 10 థీమ్స్ తో జరుగుతుందని, వీటికి సంబంధించిన శాఖ అధికారులు వచ్చి జిల్లాలో ఎటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయో, అందులో ప్రజా ప్రతినిధులు పోషించాల్సిన పాత్ర గురించి స్పష్టంగా సమాచారం అందించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టాలన్నారు. ప్రతి శాఖ నుంచి మంచి స్పీకర్లు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాల గురించి స్పష్టంగా వివరించాలని సీఎస్ పేర్కొన్నారు.

**శిక్షణకు అన్ని ఏర్పాట్లు పూర్తి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మొదటి రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ వైద్య నిపుణులతో ప్రత్యేక శిబిరం నిర్వహించామని వివరించారు. అలాగే కస్తూర్బా బాలికల విద్యాలయంలో వైద్య శిబిరం, విద్యార్థులకు పరీక్షల సమయంలో ఒత్తిడి నియంత్రణకు అవగాహన కల్పించామని తెలిపారు. అలాగే చందుర్తి, వేములవాడలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై సమావేశం ఏర్పాటు చేసి పథకాల లబ్ధిదారుల వివరాలు, ప్రభుత్వ యాక్షన్ ప్లాన్ వివరించామని స్పష్టం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అన్ని జిల్లా అధికారుల కార్యాలయాల్లో స్వచ్ఛత. పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. జిల్లాలో ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్, చైర్ పర్సన్, వార్డ్ సభ్యులకు ఈ నెల 12 వ తేదీన తంగళ్ళపల్లి మండలంలోని జిల్లెల్ల వద్ద ఉన్న వ్యవసాయ కళాశాలలో లిప్రజాపాలన ప్రగతి ప్రణాళికలిలో భాగంగా శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. శిక్షణకు హాజరు కానున్న ప్రజా ప్రతినిధులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్, మున్సిపల్ యాక్ట్, పంచాయతీ రాజ్ యాక్ట్, ప్రభుత్వ పాలన, వివిధ పథకాలపై అవగాహన కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ మేరకు పీపీటీ ప్రదర్శన, భోజనం, స్నాక్స్ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ గీత, జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, పశు వైద్య, సంవర్ధక అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, సంక్షేమ అధికారి లక్ష్మిరాజం,యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాందాస్, పంచాయతి అధికారి షర్ఫుద్దీన్, ట్రెజరీ అధికారి నవీన్ కుమార్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, వైద్యాధికారి రజిత, మిషన్ భగీరథ అధికారి అన్వర్, సెస్ ఎండీ బీ భిక్షపతి, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

## ఢిల్లీలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమనీకీ కొత్తగూడ సర్పంచ్

**- మంత్రి సీతక్క కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన సర్పంచ్**

**- ఢిల్లీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు కొత్తగూడ సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ ఎంపిక**

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- మార్చి 10 తెలంగాణ పత్రిక ప్రతినిధి మహబూబాద్ జిల్లా,

దేశ రాజధాని ఢిల్లీలో అంగరంగ వైభవంగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆహ్వానం మేరకు, కొత్తగూడ సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ వెళ్లారు, గ్రామీణ స్థాయిలో అద్భుతమైన పాలన అందిస్తూ, మహిళా సాధికారతకు కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా, కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి ఆమెకు ఈ ప్రత్యేక ఆహ్వానం అందింది. జాతీయ స్థాయి గుర్తింపు: ఢిల్లీలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి వచ్చిన ఉత్తమ మహిళా ప్రజా ప్రతినిధులతో కలిసి కొత్తగూడ సర్పంచ్ వేదికను పంచుకొనున్నారు. ఆదర్శంగా నిలిచిన పల్లె ప్రగతి: కొత్తగూడ గ్రామంలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలు, పచ్చదనం పెంపు, మహిళల స్వయం ఉపాధి పథకాల అమలు వంటి అంశాలు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు.హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు: తమ గ్రామ ప్రథమ పౌరురాలు ఢిల్లీ స్థాయికి వెళ్లి, జాతీయ వేదికపై గ్రామానికి ప్రాతినిధ్యం వహించడం పట్ల, కొత్తగూడ ప్రజలు, గ్రామ పంచాయతీ పాలకవర్గం హర్షం వ్యక్తం చేస్తున్నారు.సర్పంచ్ సందేశం ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క సహకారంతో కొత్తగూడ గ్రామంలో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని.“ఈ గౌరవం నా ఒక్కరిది కాదని, నాకు నిరంతరం అండగా నిలుస్తున్న కొత్తగూడ గ్రామ ప్రజలందరిదని. రాబోయే రోజుల్లో గ్రామాన్ని మరింత ఆదర్శంగా తీర్చిదిద్దడానికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ గుర్తింపు మరింత స్ఫూర్తినిచ్చింది“ అని ఆనందం వ్యక్తం చేశారు.



## పంచాయతీ కార్యదర్శుల అక్రమ బదిలీలు వెంటనే రద్దు చేయాలి

**- బి ఆర్ ఎస్ జనగామ జిల్లా నాయకులు పల్లాసుందర్ రామ్ రెడ్డి**





దేవరుప్పుల, మార్చి 10 (తెలంగాణ పత్రిక):

గ్రామ పంచాయతీల అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు పల్లాసుందర్ రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం దేవరుప్పుల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిరు ఉద్యోగులపై పాలకుర్తి ఎమ్మెల్యే ఎస్‌ఎస్సి రెడ్డి తో పిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి కుట్రపడ్డారని ఆరోపించారు. 90 శాతం బదిలీలు, రెండేళ్లు నిండకముందే కనీసం పంచాయతీ కార్యదర్శులను ఆప్షన్లు అడగకుండా పలు ప్రాంతాలకు పంపడం ప్రభుత్వ ఆరాచకానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శుల పై వారు ప్రతాపం చూపిస్తున్నారని ఆరోపించారు. సొంత డబ్బులు పెట్టి గ్రామాలను చక్కదిద్దింది పంచాయితీ కార్యదర్శులే గుర్తుపెట్టుకోవాలన్నారు. వెంటనే అక్రమ బదిలీలను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాల నుండి పాలకవర్గం లేకున్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రాకున్నా కూడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రతి కార్యదర్శి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి గ్రామపంచాయతీలను నడిపించారన్నారు. జనగాం జిల్లాలో రాత్రికి రాత్రే 160 మంది పంచాయతీ కార్యదర్శులను డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేయడం సిగ్గు చేటు అని ఆయన విమర్శించారు. జిల్లావ్యాప్తంగా జరిగిన బదిలీల్లో పాలకుర్తి నియోజకవర్గంలో 90% బదిలీలు చేయడం ఝాన్సీ రెడ్డి, యశస్విని రెడ్డి కుట్రేనని అన్నారు. ఒక్కో కార్యదర్శి కి మూడు నుంచి ఐదు లక్షల మధ్యలో బిల్లులు రావాలని, అవి వచ్చే సమయంలో బదిలీలు చేయడం ఏంటన్నారు. బిల్లు రాక కుటుంబ పరిస్థితి బాగోలేక ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులను ఇప్పుడు డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేయాల్సిన అవసరం ఏముంది అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అరకొర జీతంతో సతమతం అవుతున్న కార్యదర్శిల బదిలీలు దేవరుప్పుల పంచాయతీ కార్యదర్శి ,బచ్చన్నపేటకు వేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. పాలకుర్తి పంచాయతీ కార్యదర్శిని వర్ధన్నపేటకు వేయడం, కొడకండ్ల కార్యదర్శిని చిల్పూర్ వేయడం సమంజసం కాదన్నారు. ఆరు నెలలైనా వారి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులకు బలి శాపంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం తమ పద్ధతి మార్చుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

# మాడ్గుల యాదగిరి దాతృత్వం అభినందనీయం

**– తహశీల్దార్ సరోజ పావని**

మాడుగులపల్లి/నల్గొండ/మార్చి 10:(తెలంగాణ పత్రిక):–

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన మండలంలోని సీత్యతండ గ్రామపంచాయతీ పరిధిలోని పుచ్చకాయలగూడెం గ్రామానికి చెందిన మాడ్గుల యాదగిరి దాతృత్వం అభినందనీయమని మండల తహశీల్దార్ సరోజ పావని, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం కళాశాల ప్రత్యేక అధికారి సునీత అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో పదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మాడ్గుల యాదగిరి ఆర్థిక సహకారంతో అందించిన పరీక్ష ప్యాడ్ వాటర్ బాటిల్, పెన్నులను మండలతహశీల్దార్ సరోజ పావని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం కళాశాల ప్రత్యేక అధికారి సునీత లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టమైనప్పటికీ ఇష్టంతో చదివి పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభను చాటాలని కోరారు. విద్యతోనే విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తు ఆధారపడి ఉన్నందున విద్యార్థినులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలను పొంది కనిపించిన తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో




ఎంఆర్ఐ శ్యామ్, గ్రామ పాలన అధికారులు శ్రీనివాస్, రవి, కేజీబీవీ ఉపాధ్యాయులు మున్నీసా బేగం శ్రీదేవి, లలిత, రమణమ్మ, శైలజ షాహిన్, చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మడిహెట్టి బ్యారేజ్‌కు రూ.10,000 కోట్లు కేటాయించాలి

**– మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి**

జగిత్యాల, మార్చి 10, (తెలంగాణ పత్రిక ):

ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కీలకమైన తుమ్మడిహెట్టి బ్యారేజ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. గోదావరి దిగువకు వృథాగా వెళ్లిపోతున్న నీటిని వినియోగించుకోవాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర రెడ్డి ప్రాణహిత నది జలాలను వినియోగించే ప్రణాళికకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రాణహిత నది నీటి హక్కులను వినియోగించుకోవడానికి తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టేలా కాలువలు కూడా తవ్వినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్తర తెలంగాణలో త్రాగునీరు, సాగునీరు సమస్యలు పరిష్కారమవడంతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాలకు త్రాగునీరు మరియు పారిశ్రామిక అవసరాలకు నీరు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తుమ్మడిహెట్టి బ్యారేజ్ టెండర్ దశలోనే నిలిచిపోయిందని, అదే సమయంలో మేడిగడ్డ వద్ద 2023 అక్టోబర్‌లో 7వ బ్లాక్ కుంగిపోవడంతో నీటి తరలింపు వ్యవస్థ దెబ్బ తిన్నదని అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలకు మరమ్మతులు చేపట్టాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ సంస్థ సూచించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి మరమ్మతులు చేపట్టి, తరువాత కాంట్రాక్టర్ వద్ద నుంచి వ్యయాన్ని వసూలు చేయవచ్చని, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవచ్చని సూచించారు. తుమ్మడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా భాగమని, దీనిని నిర్మిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం 152 మీటర్ల నీటి మట్టానికి అనుగుణంగా తవ్విన కాలువలను 148 మీటర్లకు అనుగుణంగా రీడిజైన్ చేయడం ద్వారా నీటి తరలింపు సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే జైపూర్ వాగు నుంచి సుందిల్ల



లిఫ్ట్ ద్వారా ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశముందని చెప్పారు. తుమ్మడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం, కాలువల రీడిజైన్, నీటి తరలింపు వ్యవస్థ ఏర్పాటుకు రూ.10,000 కోట్లకు మించదని తెలిపారు. రెండు సంవత్సరాల్లో రూ.5,000 కోట్లు చొప్పున బడ్జెట్‌లో కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి గోదావరి, ప్రాణహిత నదులు ఆయువుపట్టు లాంటివని, గత రెండేళ్లుగా ప్రకృతి సహకరించినప్పటికీ భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే త్రాగునీరు, సాగునీరు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అందుకే మేడిగడ్డ పునరుద్ధరణతో పాటు తుమ్మడిహెట్టి బ్యారేజ్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత పదేళ్లుగా బాధ్యతగల పౌరుడిగా తుమ్మడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను ప్రభుత్వాల దృష్టికి తీసుకువస్తున్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి తెలిపారు.

# ఘనంగా ఎస్ఆర్ఎం పాఠశాల ప్రథమ వార్షికోత్సవ మహోత్సవం







కోదాడ, మార్చి 10(తెలంగాణ పత్రిక):

ఉన్నత విద్య క్రమ శిక్షణకు మారుపేరు ఎస్ఆర్ఎం పాఠశాలని, ప్రశాంత వాతావరణంలో కార్పోరేట్ అంగులతో విద్యను అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ ఎస్ఆర్ఎం పాఠశాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. కోదాడ పట్టణ పరిధిలోని స్థానిక బాలాజీ నగర్ లో నిర్మించిన ఎస్ఆర్ఎం పాఠశాల ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ కేసినేని శ్రీదేవి ఆధ్వర్యంలో కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ. కోదాడ నియోజకవర్గం ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకొని ప్రశాంతంగా పరీక్షలు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించి పుట్టిన స్థలానికి పాఠశాలకు గురువులకు తల్లిదండ్రుల కు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని తెలిపారు. ఎస్ఆర్ఎం పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల కు తక్కువ ఫీజుతో కార్పొరేట్ విద్యను అందించి విద్యాభివృద్ధికి బాటలు వేయాలని యాజమాన్యాన్ని కోరారు కోదాడ పట్టణంలో కార్పొరేట్ పాఠశాలలకు పోటీపడి నిర్మించి విజయం అందిస్తున్నారని తెలిపారు పాఠశాలలోఅనుభవం ఉన్న అధ్యాపకులతో విద్యను అందించి ఎన్నో విజయాలు సాధించిన పాఠశాల కరస్పాండెంట్ శ్రీదేవి ని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థినిగా విద్యను అభ్యసించినప్పుడు కష్టాలు విద్యను ఏ విధంగా అభ్యసించారో క్రమశిక్షణతో ఉండాలోపిల్లలకు తెలియజేశారు.పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాలకు మెమొంటోలు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేను పూలమాల సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ ఏడవ వార్డు కౌన్సిలర్ చైతన్య నాయక్, 8వ వార్డు కౌన్సిలర్ రామ్ శెట్టి ఉదయశ్రీ శ్రీనివాస్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్, అధ్యాపక బృందం ,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం

ఆత్మకూరు: మార్చి 10, (తెలంగాణ పత్రిక) :

99 రోజుల రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా, టీజీ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండ్యాల ఆదేశాల మేరకు మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రం లో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఫారెస్ట్ అధికారి లక్ష్మణాచారి, నార్కోటిక్ డ్రగ్స్ ఎస్ఐ మోగలి, ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఎంపివో , సిఐ సంతోష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.సుమారు 100 మంది విద్యార్థులు, 20 మంది యువకులు, వార్డు సభ్యుడు సందీప్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమం




విజయవంతంగా ముగిసింది.

# గూడూరు పశువుల (సంత) అంగడి వేలం



పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:– మార్చి 10. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):

మహబూబాబాద్ జిల్లా, స్థానిక గూడూరు గ్రామ పంచాయతిచే నిర్వహించబడుతున్న, పశువుల (సంత) అంగడి 2025–26 లీజు గడువు తేది: 31–3–2026తో ముగుస్తున్న నేపథ్యంలో, తిరిగి 2026–27 సంవత్సరము నూతనంగా లీజు కొరకు తేది. 12–3–2026 గురువారము రోజున, ఉదయం 11:00 గంటలకు, గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, పేసా చైర్మన్ వాంకుడోత్ సునిత కొమ్మాలు నాయక్ అధ్యక్షతన, అంగడి (సంత) లీజు గ్రామసభ ఏర్పాటు చేయనైనది. కావున లీజు పొందగోరు వారు, ఇట్టి గ్రామసభలో పాల్గొని నిబంధనల ప్రకారము, అంగడి (సంత) లీజు పొందవచ్చును. ఈ కార్యక్రమంలో గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ చంటి స్వామి, పంచాయతీ కార్యదర్శి బండి అశోక్, వార్డు సభ్యులు ఇనుముల యాకాంబ్రం, వాంకుడోత్ శ్రీనివాస్, గార్లపాటి శిరీష, పత్తేం వెంకన్న, గోనె శిరీష, చీరబోయిన కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నారం రైతుల కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





పటాన్చెరు నియోజకవర్గం మార్చ్ 10 తెలంగాణ పత్రిక

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం గ్రామంలోని సర్వే నంబర్ 261లో ఉన్న రైతుల భూములను ప్రభుత్వం తీసుకునే ప్రయత్నాలు ఆపకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం ఉదయం స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి అన్నారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 261లో ఉన్న వ్యవసాయ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ భూములపై ప్రభుత్వం భూసేకరణ పేరుతో చేస్తున్న చర్యల పై ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హయాంలో సర్వే నంబర్ 261లోని వ్యవసాయ భూములకు సంబంధించిన 117 మంది రైతుల వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసి పాస్ పుస్తకాలు అందించారని గుర్తు చేశారు. అప్పటి నుంచి రైతులు కుటుంబాలతో కలిసి కష్టపడి పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మరియు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ కలిసి భూవ్యాపార దళారులలా వ్యవహరిస్తూ పేద, సన్నకారు రైతుల భూములను పరిశ్రమల పేరుతో పెద్ద కంపెనీలు, భూవ్యాపార సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అన్నారం గ్రామంలోని సర్వే నంబర్ 261లో ఉన్న సుమారు 580 ఎకరాల పచ్చని పంట భూములను ప్రైవేటు పరిశ్రమలకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజా అవసరాల కోసం భూములు తీసుకునే సందర్భంలో రైతులను ఒప్పించి మెరుగైన నష్టపరిహారం ఇవ్వడం సాధారణమని, కానీ తెలంగాణలో మాత్రం భూవ్యాపారుల కోసం రైతులను బెదిరించి భూములను తీసుకుంటున్నారని విమర్శించారు. అన్నారం భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే వేలాది మంది రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం, కార్యదర్శాలయాన్ని ముట్టడించడంతో పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గజం భూమిని కూడా కోల్పోనివ్వమని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షురాలు సంధ్య గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు సంజీవ్ రెడ్డి, కిషన్, మురళి, రాధిక రాజు, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు విజయ్ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచులు రుక్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరహరి, ఇతర నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయ్ పూలే స్ఫూర్తి తరతరాలకు ఆదర్శం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ




అశ్వారావుపేట ఆర్ సి, మార్చి 10, తెలంగాణ పత్రిక.

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రిబాయ్ పూలే వర్ధంతి సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయ్ పూలే భారతదేశంలో మహిళల విద్యకు పునాది వేసిన మహనీయురాలని కొనియాడారు. తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి బాలికల విద్య కోసం తొలి పాఠశాలను స్థాపించి సమాజంలోని అణగారిన వర్గాలకు విద్యా వెలుగులు పంచారని తెలిపారు. మహిళలు చదువుకుని సమాజంలో గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో ఆమె జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, విద్యా హక్కుల కోసం సావిత్రిబాయ్ పూలే చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. మహిళల సాధికారత, విద్యాభివృద్ధి కోసం ఆమె చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

నర్సంపేట/దుగ్గొండి/మార్చి 10 తెలంగాణ పత్రిక



బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన దుగ్గొండి మండలం లోని తొగర్రాయి గ్రామ శివారు మూల మలుపు వద్ద మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడు నల్లబెల్లి మండలం దస్తగిరి పల్లి గ్రామానికి చెందిన పోతరవేణి మనోహర్ (26) s/o చేరాలు గిర్నిబావి వైపు నుండి దుగ్గొండికి వేళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల కారణాల పై పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట మార్చురీకి తరలించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మఒడి



భిక్కనూరు మార్చి 10 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు, మండలంలోని ఏడు ఉపకేంద్రాల నుండి గర్భిణి స్త్రీలను ఆశాకార్యకర్తలు తీసుకొచ్చి వారికి రక్తపరీక్షలు, బరువు, ఎత్తు, అధికరక్తపోటు మొదలగు పరీక్షలుచేసి,డాక్టర్ దివ్య మాట్లాడుతు గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారంతోపాటు పలు సూచనలు చేశారు,ఈ క్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వానశ్రీ హెచ్,పి,ఎల్,సి 18 పరీక్షలను చేశారు,ఈ క్రమంలో ఎం,ఎల్,హెచ్,పి పూజ,హెల్త్ అసిస్టెంట్ మాధవి, మంజుల, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వేకాల్ క్యాన్సర్ హెచ్ పి వి టీకా పంపిణీ

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- మార్చి 10. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):



మహబూబాబాద్ జిల్లా, మంగళవారం రోజున ఆడబిడ్డల ఆరోగ్యం కోసం మన నరేంద్ర మోదీ సంకల్పం. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్ గూడూరు మండల కేంద్రంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం హెచ్పివి టీకా కేంద్రంను సందర్శించి, మాట్లాడుతూ మన ఆడబిడ్డల రక్షణే ధ్యేయంగా ప్రాణాంతకమైన సర్వేకాల్ క్యాన్సర్ నుండి వారిని కాపాడేందుకు, హెచ్ పి వి టీకా పంపిణీ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా, 14 నుంచి 15 సంవత్సరాల బాలికల ందరికీ టీకా పంపించేస్తున్నారు. ప్రతి బాలిక టీకా తీసుకునేలా ప్రోత్సహించి, రేపటి మహిళలతరం క్యాన్సర్ బారిన పడకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని బాలికలు అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో డాక్టర్లు, బాలికలు, వారి తల్లితండ్రులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏరియాలోని సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 10

మంగళవారంన కొత్తగూడెం ఏరియాలోని సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆర్.సి.ఓ.ఏ క్లబ్, రుద్రంపూర్ నందు నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు డాక్టర్ మామిడి సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ (గైనకాలజీ) మాతా శిశు హాస్పిటల్ కొత్తగూడెం, ఎం. మనీషా, సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, 2-టౌన్ రామవరం హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమమునకు కన్వీనర్ గా కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలకు చేరాలని, ప్రతి ఒక్క మహిళ ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని, కష్టపడి చదివి ఉన్నత స్థాయిలను చేరుకోవాలని అన్నారు. ఉద్యోగాలలో పురుషులకు సమానంగా మహిళలు పోటీ పడుతున్నారని అన్నారు. ఇప్పటికే మహిళలను చైతన్యం వచ్చిందని, మునుముందు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. అలాగే ఎక్కడైతే మహిళలు గౌరవింపబడతారో అక్కడే సుఖసంతోషాలు వర్ధిల్లుతాయని అన్నారు. ఈ సంవత్సరమునకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని "హక్కులు, న్యాయం, చర్య అన్ని మహిళలు మరియు బాలికల కోసం", అనే థీమ్‌తో జరుపుకుంటున్నారు. ఈ థీమ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, ప్రస్తుత ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ వారి పురోగతికి వేగవంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా వ్యూహాలు, వనరులు కార్యకలాపాలను గుర్తించి, వాటి అమలుకు మద్దతు ఇవ్వడం. మహిళలు సమాజంలో అన్ని రంగాలలో సమాన అవకాశాలు పొందాలి, వారి హక్కులను కాపాడాలి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి, మహిళల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలి.నేటి ఆధునిక యుగంలో సాంకేతికత అన్ని రంగాలలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో, మహిళలు సాంకేతిక రంగంలో రాణించడం, సమాన అవకాశాలు పొందడం, డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ థీమ్ యొక్క ముఖ్య ఉద్దేశం. మహిళ తన యొక్క జీవితాన్ని కూతురుగా, భార్యగా తల్లిగా మంచి బంధువుగా సమాజంలో తన ధర్మాన్ని నెరవేర్చి కుటుంబా నికి నిర్విరామంగా కృషి చేస్తుందని ఈ సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉత్తమ మహిళలుగా డాక్టర్ మామిడి సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ (గైనకాలజీ) మాతా శిశు హాస్పిటల్ కొత్తగూడెం, ఎం. మనీషా, సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, 2- టౌన్ రామవరం ను సన్మానించడం జరిగింది. అనంతరం సింగరేణి సేవా సమితి కొత్తగూడెం ఏరియా వారిచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విచ్చేసిన వీక్షకులను అలరించడం జరిగింది. ఆ తదుపరి అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న వారికి ప్రోత్సాహ బహుమతులను అందించడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియాలోని వివిధ హోదాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎం తో పాటు సింగరేణి సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి, కొత్తగూడెం ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వి. మల్లికార్జున రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, జి.పద్మాజా కోటిరెడ్డి, ఎస్. సునీత మురళీ సెక్రటరీ లేడీస్ క్లబ్, వి.అనిత లక్ష్మి మధుకర్, సిహెచ్. జయశ్రీ రామకృష్ణ, కే. పద్మావతి సూర్యనారాయణ రాజు, ఫాతిమా రజాక్, ఇతర మహిళా ఉద్యోగులు అధికారులు సేవ సభ్యులు పాల్గొన్నారు.

## 99 రోజుల కార్యాచరణ పై సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్





భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 10

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం కోసం కొత్తగూడెం క్లబ్‌లో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పరిశీలించారు. శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం క్లబ్‌లోని సమావేశ మందిరాన్ని, సిట్టింగ్ సామర్థ్యాన్ని, భోజన ఏర్పాట్లకు కేటాయించిన ప్రదేశాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధుల సౌకర్యార్థం సభా ప్రాంగణంలో సరిపడా సిట్టింగ్‌ను మండలాల వారీగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించే విధంగా సభా ప్రాంగణాన్ని ఫ్లెక్సీలతో అలంకరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం నిర్వహించే ప్రాంగణాన్ని ఫైర్ సేఫ్టీ అధికారులు ముందుగా పరిశీలించి ధ్రువీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణకు తగిన చర్యలు చేపట్టి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమం సజావుగా సాగేందుకు అవసరమైన శిక్షణ సామగ్రిని ముందుగానే సిద్ధం చేయాలని, కార్యక్రమం నిర్వహణ కోసం ఎల్ఈడి స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ వంటి సాంకేతిక సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరి కోసం ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేసి, వారికి గుర్తింపు కార్డులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే శిక్షణకు హాజరయ్యే ప్రజాప్రతినిధులందరికీ భోజన ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని అధికారులకు తెలిపారు. శిక్షణ శిబిరం వద్ద అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంబులెన్స్‌తో పాటు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన మాస్టర్ ట్రైనర్లు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, నిధుల సమర్థ వినియోగం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణ అమలు విధానం తదితర అంశాల పై ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, తాసిల్దార్ పుల్లయ్య,డీపీఓ సుధీర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**- పిఎస్ హెచ్ఎం రాష్ట్ర అధ్యక్షులు బి మురళీధర్ గౌడ్**

దేవరుప్పుల, మార్చి 10 (తెలంగాణ పత్రిక):

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేజీహెచ్ఎం రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ గౌడ్ అన్నారు. జనగామ జిల్లా పీజీహెచ్ఎం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మాదాపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ నల్ల లలిత మురళీధర్ గౌడ్‌ను శాలువాతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్, జనగాం జిల్లా గౌరవ అధ్యక్షులు మర్యాల రమేష్ బాబు, జిల్లా అధ్యక్షులు వెల్పుల చంద్రమ్, జిల్లా కార్యదర్శి జి. శంకరయ్య, ఏ ఏ



పీ సి చైర్మన్ వసంత, గ్రామ సర్పంచ్ బంజారా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహణ

కొత్తగూడెం ఆర్ సి మార్చి 10 ( తెలంగాణ పత్రిక)

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళా విద్యాభివృద్ధి, సమానత్వం కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలను నాయకులు స్మరించారు. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కురిమెల్ల శంకర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళా విద్యకు పునాది వేసిన గొప్ప సామాజిక సంస్కర్త అని అన్నారు. సమాజంలో మహిళలు చదువుకోవడం కష్టంగా ఉన్న కాలంలోనే ఆమె బాలికల కోసం తొలి పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యకు మార్గం సుగమం చేశారని పేర్కొన్నారు. మహిళలు విద్యావంతులు అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆమె నమ్మి జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ మహిళా సాధికారత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అంకినీడు ప్రసాదు, మాదా శ్రీరాములు,



మహంకాళి బిక్షపతి, ఉమాదేవి, డి. కొండ నీలావతి, రాధా, విజయలక్ష్మి, రజిత, శ్రీలత, జలాలు, కందుకూరు వీరభద్రం, వేముల నరేష్, మేకల జగన్నాథం, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు మరియు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై సావిత్రిబాయి పూలేకు ఘనంగా నివాళులు అర్పించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత పనులు

తెలంగాణ పత్రిక , పినపాక నియోజకవర్గ ప్రతినిధి ,మార్చి 10.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామపంచాయతీల్లో పరిశుభ్రత పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామాలను శుభ్రంగా ఉంచే దిశగా సర్పంచులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, డ్రైనేజీలు శుభ్రపరచడం, చెత్తను తొలగించడం, మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం వంటి పనులను సర్పంచులు పర్యవేక్షిస్తూ నిర్వహిస్తున్నారు. అలాగే చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పరిశుభ్ర గ్రామాల నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో కలిసి సర్పంచులు స్వయంగా పనులను పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజలకు సూచిస్తూ గ్రామస్థుల సహకారం కోరుతున్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత




మెరుగుపడుతుందని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని సర్పంచులు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ కార్యక్రమానికి గ్రామస్థులు కూడా సహకరించాలని కోరారు.

# కుక్కల బెడద నివారణ కై మటన్ మార్కెట్ తరలింపు

**– శాశ్వత మార్కెట్ నిర్మాణానికి కటికే సోదరులకు హామీ ఇచ్చిన సర్పంచ్ నరసయ్య**

కామారెడ్డి, మార్చ్ 10,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో మటన్ మార్కెట్ వద్ద పిచ్చి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, సోమవారం ఆరుగురు పై దాడి చేయడంతో వారు కామారెడ్డి, హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని కుక్కల బెడద నివారణ చేయడానికి మటన్ మార్కెట్ ను రైతు వేదిక వద్ద ఉన్న గ్రామపంచాయతీ స్థలంలో ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ ఐరెని నరసయ్య మంగళవారం తెలిపారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో సర్పంచ్ జిపిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కటిక సంఘం సభ్యులతో మాట్లాడి మటన్ మార్కెట్ ను రైతు వేదిక వద్దకు తరలించేందుకు ప్రణాళికను తయారు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తరపున 5 లక్షలు, ఎంపీ సురేష్ శెట్కర్ తరపున 5 లక్షలను మంజూరు చేయించి శాశ్వత మాడిగల నిర్మాణానికి కృషి చేస్తానని కటిక సోదరులకు సర్పంచ్ నర్సయ్య హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న మడిగేలను కటికే దుకాణదారులు రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిపారు. శాశ్వత మాడిగల నిర్మాణానికై ఆరు నెలల సమయంలో పనులు పూర్తి చేయిస్తామన్నారు. తాత్కాలికంగా రైతు వేదిక వద్ద



మటన్ మార్కెట్ ఏర్పాటుకు బోరు మోటర్‌తో పాటు 2000 లీటర్ల వాటర్ ట్యాంక్ ను ప్రజల సౌకర్యార్థం తక్షణమే గ్రామపంచాయతీ నుండి ఏర్పాటు చేయిస్తామని, ఆరు నెలల్లోపు అక్కడే పర్మినెంట్ నిర్మాణాలు చేపట్టి కటిక సోదరులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. దోమకొండ మటన్ మార్కెట్ పెద్దది కావడంతో భిక్కనూరు మండల కేంద్రంలో మాదిరి కటిక సోదరులకు మార్కెట్ నిర్మింప చేస్తామని ఇచ్చారు.

# యువత మత్తు పదార్థాలకు బాని సై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దు

**– నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి**

నర్సంపేట మార్చి 10 తెలంగాణ పత్రిక

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని గిర్నిబావి, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల వెంకటాపురం, గిర్ని బావి, నాచినపల్లి, దుగ్గొండి, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించిని నర్సంపేట ఎసిపి రవీందర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెడు వాసానల వైపు వెళ్లకుండా యువత తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. గ్రామాల్లోని పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగిస్తున్న వారి సమాచారాన్ని పోలీసులకు తెలుపాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా వినియోగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు స్థానిక



ఎస్ఐ రావుల రణధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు క్రికెట్ జెర్సీల పంపిణీ యువతకు అండగా యువ నాయకుడు కుంజా రాకేష్

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:– మార్చి 10. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):

మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడెం మండల కేంద్రం పరిధిలోని గ్రామాలలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, క్రీడల పట్ల యువతకు ఆసక్తిని పెంపొందించేందుకు దొరవారి వేంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంజ రాకేష్ ఒక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ యువ క్రికెట్ జట్లకు నూతన జెర్సీలు, క్రీడా సామాగ్రిని ఆయన స్వయంగా అందజేశారు. గ్రామంలోని యువత వ్యసనాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనం సాగించాలంటే క్రీడలు ఎంతో అవసరమని కుంజ రాకేష్ పేర్కొన్నారు. కేవలం జెర్సీలే కాకుండా, మైదానంలో అవసరమైన సౌకర్యాలను కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. క్రీడలు గెలుపోటముల కోసం మాత్రమే కాకుండా, గ్రామంలో ఐక్యమత్యాన్ని పెంచడానికి దోహదపడతాయని ఆయన యువతకు దిశానిర్దేశం చేశారు. కుంజ రాకేష్ మాటల్లో.. మా ఊరి పిల్లలు కేవలం ఊరికే పరిమితం కాకుండా, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరవాలన్నదే నా ఆశయం. దానికి అవసరమైన ఆర్థిక, నైతిక మద్దతు ఇవ్వడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. ఈ కొత్త జెర్సీలు వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని నమ్ముతున్నానని అన్నారు. యువత స్పందన తమకు అండగా నిలుస్తూ, సొంత ఖర్చుతో కొత్త జెర్సీలు అందజేసిన సర్పంచ్‌కు క్రీడాకారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



రాబోయే టోర్నమెంట్‌లలో కచ్చితంగా విజయం సాధించి గ్రామానికి మంచి పేరు తెస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య, గంగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, కొత్తగూడ, గంగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రూప్ సింగ్ నాయక్, కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఇర్పరాజేశ్వర్ రావు, కొత్తగూడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, చెరువు ముందు తండ సర్పంచ్ కుంజ సరిత శోభన్, సాదిరెడ్డిపల్లి సర్పంచ్ కిరణ్, కోనాపురం సర్పంచ్ బిక్షపతి, రామన్న గూడెం సర్పంచ్ పార్వతి దేశ్య, రేన్య తండా సర్పంచ్ లక్ష్మి రావోజి, మండల కాంగ్రెస్ నాయకుడు సోలం వెంకన్న, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ

**– జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 10

జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలోని 37 పరీక్షా కేంద్రాలలో మొత్తం 8,737 మంది విద్యార్థులకు గాను 8,518 మంది హాజరై పరీక్ష రాశారని, 219 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించబడినట్లు వెల్లడించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినట్లు తెలిపారు.

# ఇసుక లారీ పట్టివేత ఎస్సై గోపాల్ రెడ్డి

కోదాడ, మార్చి 10 (తెలంగాణ పత్రిక):

అక్రమంగా దొంగతనంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను ఆంధ్ర ప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా, వత్సవాయి గ్రామా శివారులోని మున్నేరు వాగు నుండి లారీ నెంబర్ టీజీ-08-వి-8079 గల లారీ డ్రైవరు అయిన బిల్లా సాంభశివ రావు కోటేశ్వర రావు (30) జగన్నాధపురం గ్రామం వీర్లపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లా మరియు లారీ క్లీనర్ అయిన కారం శ్రీనివాస రావు తండ్రి రత్తయ్య అక్రమంగా దొంగతనంగా ఎలాంటి అనుమతులు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల అనుమతి లేకుండా ఇసుకను ఆంధ్ర ప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా, వత్సవాయి గ్రామా శివారులోని మున్నేరు వాగు లో లోడ్ చేసుకొని హైద్రాబాద్ కు తరలిస్తుండగా రామాపురం క్రాస్ రోడ్డు వద్ద పట్టుబడి చేసి ఇట్టి లారీ డ్రైవరు, క్లీనర్, ఓనర్ పై కేసు నమోదు చేసి ఇట్టి ఇసుక తరలింపులో ఇంకా ఎంతమంది ఉన్నారో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు కోదాడ రూరల్ ఎస్సై సిహెచ్ గోపాల్ రెడ్డి తెలిపారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన ఎస్సై బి. మహేష్



ఏటూరు నాగారం , మార్చి 10 తెలంగాణ పత్రిక ములుగు జిల్లా స్టాపర్:

మైనర్ విద్యార్థులు వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ ఏటూరునాగారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్న మైనర్ విద్యార్థులకు ఎస్సై బి. మహేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. పరీక్షల సమయాల్లో విద్యార్థులు తొందరలో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు. 18 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు విద్యార్థుల భద్రత కోసమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారని, శిక్షల కంటే ముందుగా అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చంద్ర మోహన్.గోపీ.పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి మృతి

కామారెడ్డి, మార్చి 10, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల మాజీ జెడ్పిటిసి పోసానిపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నా రెడ్డి మోహన్ రెడ్డి రోడ్డు ప్రమాదం లో మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు సాంఘిక ద్వారా తెలిసింది. మోహన్ రెడ్డి మృతి వార్త తెలియడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి కార్యకర్తలు దుఃఖసాహారంలో మునిగి పోయారు. నా రెడ్డి మోహన్ రెడ్డి జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ గా ఐదు సంవత్సరాలు కొనసాగారు. ఈ ప్రాంతంలో జిల్లాలో ఆయనకు పేరు పాటిష్టత కలిగిన వ్యక్తి.

# సిఎస్ పి రౌతు సౌందర్యను సన్మానించిన టీజీబీ బ్యాంకు మేనేజర్ సిద్ధార్థ

నర్సంపేట మార్చి 10 తెలంగాణ పత్రిక



దుగ్గొండి,గ్రామంలో పనిచేసే బ్యాంక్ మిత్రలు బ్యాంక్ ఖాతాదారులకు ఎంత చురుగ్గా సేవలను అందిస్తే గుర్తింపు లబిస్తుందని టీజీబీ మేనేజర్ జె.సిద్ధార్థ అన్నారు. మంగళవారం మండలంలోని గిర్నిబావిలో గల టీజీబీ మందపల్లి శాఖ పరిధిలోని ఆయా గ్రామాలలో బ్యాంక్ సేవలను చురుగ్గా అందిస్తున్న ఐరిక్స్ – టీజీబీ బ్యాంక్ మిత్రలను గుర్తించిన మేనేజర్ సిద్ధార్థ శాలువాలతో సన్మానించి 2026 సంవత్సరం ఎస్ బి ఐ లైఫ్ డైరీలను ప్రధానం చేశారు. టీజీబీ మేనేజర్ తో శాలువా సన్మానంతో పాటు, ఎస్ బీఐ డైరీని అందుకున్న మందపల్లి గ్రామం బ్యాంక్ మిత్ర రౌతు సౌందర్యతో పాటుగా మరో నాలుగు గ్రామాలకు చెందిన బ్యాంక్ మిత్రలు ఉన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు సురేష్ రెడ్డి, చిన్న నాయుడు, ఐరిక్స్ బ్యాంక్ ఛానల్ మేనేజర్ కొర్ర నర్సింహ, ఎస్ బి ఐ లైప్ వినోద్ కుమార్, అకౌంటెంట్ హర్ష, క్యాషియర్ ప్రీతి, చిల్పూరి విజేందర్, బ్యాంక్ మిత్రులు, పాల్గొన్నారు.

## సీనియర్ నాయకులు నారెడ్డి మోహన్ రెడ్డి మృతి పట్ల షబ్బీర్ అలీ సంతాపం

కామారెడ్డి ,మార్చ్ 10, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లారామారెడ్డి మాజీ జెడ్పిటిసి, పోసానిపేట వాస్తవ్యులు, కాంగ్రెస్ పార్టీ నమ్మకమైన సీనియర్ నాయకులు నారెడ్డి మోహన్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించడం అత్యంత బాధాకరమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర వార్త తెలిసిన వెంటనే షబ్బీర్ అలీ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మోహన్ రెడ్డి తో ఉన్న దశాబ్దాల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, పార్టీకి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. మోహన్ రెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి, వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. నిరంతరం ప్రజల కోసం పరితపించే గొప్ప నాయకుడిని మనం కోల్పోయాము. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో దైవం ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కామారెడ్డి నియోజక వర్గ కాంగ్రెస్ శ్రేణులు ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

## శ్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలి



కామారెడ్డి, మార్చ్10,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి, కుప్రియల్, వజ్జపల్లి, సాజ్జనాయక్ తండాలో డ్వాక్రా మహిళలు శ్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపిఎం ప్రసాద్ మంగళవారం తెలియచేశారు.శ్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తేనే మళ్లీ కొత్త రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.శ్రీనిధి రుణాలను రికవరీ చేయవలసిన బాధ్యత వివోఎల పైన ఉంటుందని తెలియచేశారు.శ్రీనీది ద్వారా తీసుకున్న రెండు లక్షల ఏనబై ఒక్క వెయ్యిల మొండి బకాయిలను వసూలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉత్తనూర్ సిబ్బంది, అడ్లూరు ఎల్లారెడ్డి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బందిలు పాల్గొన్నారు.

## మహిళను హత్య చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

పాపన్నపేట, ప్రతినిధి మార్చి 10:(తెలంగాణ పత్రిక)



ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన సంఘటన ఏడుపాయల వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం కొడుపాక గ్రామానికి చెందిన బ్యాగరి సులోచన(35) కొన్నేళ్ల క్రితం భర్త మృతి చెందడంతో అప్పటి నుంచి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. మెదక్‌లో కూలీ పనులకు వెళ్తూ జీవిస్తుంది. కాగా సోమవారం ఉదయం ఇంట్లో నుంచి కూలీ పనుల కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.దీంతో ఇంటి వద్ద ఉన్న కుమారుడు రాజేష్ బంధువులకు సమాచారం అందించాడు.చుట్టూ పక్కల వెతికారు.ఆచూకీ లభించలేదు.మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు ఏడుపాయల సమీపంలోని చెలిమకుంట వద్ద అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతురాలి ముఖంపై కర్రతో దాడి చేసిన బలమైన గాయం ఉండడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు.మృతురాలి సోదరుడు దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## దోమకొండలో ఆరుగురిని కార్చిన కుక్కలు

- ఒక పాప సీరియస్

కామారెడ్డి, మార్చ్ 10, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో సోమవారం రాత్రి మటన్ మార్కెట్ ఏరియాలో గల ఒక కుక్క ఆరుగురిపై దాడి చేసింది ఒక బాలికకు తలపై తీవ్ర గాయం కాగా రోడ్డంతా రక్తం పారింది దీంతో భయభ్రాంతులకు గురైన ఆ ప్రాంత ప్రజలు అందరూ ఆ కుక్కను వెంబడించి చంపేశారు. ఈ కుక్క సోమవారం రోజు ఆరుగురిని కరిచింది దీంతో ఒక బాలిక సీరియస్ కావడంతో ఆమెను అధికారులు కామారెడ్డి నుండి హైదరాబాద్ ఆసుపత్రుల కు రిఫర్ చేశారు. బాలికను కామారెడ్డి ఆసుపత్రిలో స్థానిక ప్రజా ప్రతినిధులు సందర్శించారు ఎలాగైనా బాలిక ప్రాణాలనుకాపాడాలని వైద్య అధికారులకు స్థానిక సర్పంచ్ ఐరన్ నరసయ్య మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ నాయకులు సూచించినట్లు తెలిసింది. దీంతో స్థానిక యువకులు గ్రామంలోని కుక్కలన్నింటిని తరలించాలని డిమాండ్ చేస్తున్నారు ఈ మేరకు సర్పంచ్ ప్రత్యేక సమావేశం నిర్వహించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు.

## 12న సర్పంచ్ మేయర్లకు ప్రతిష్టాత్మకంగా శిక్షణ తరగతులు







- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

కామారెడ్డి మార్చి 10,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు , 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఆదేశించారు. జూన్ 12వ తేదీ వరకు నిర్వహించే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల 12న కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంపై నేడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే ఉటంకిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు ఏవిధంగా నైతే ప్రామాణికమైన ఫలితాలు అందుతాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు , ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12,700 గ్రామా పంచాయతీలు, 110 మున్సిపల్ సంస్థలున్నాయని, వీటన్నింటిలో 15000 మంది ప్రజాప్రతినిధులున్నారని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎం.పీ లు , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లను కూడా ఆహ్వానించాలని సి.ఎస్ స్పష్టం చేశారు. జిల్లా లోని వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపే ఫోటో ప్రదర్శనను కూడా వేదిక వద్ద ఏర్పాటు చేయాలన్నారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ఫైళ్ల క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను రామకృష్ణా రావు అభినందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఏఎస్పీ చైతన్య, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఆర్డీఓ, విద్యా , వైద్య శాఖ ఇతర అన్ని శాఖలఅధికారులు, పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి, జిల్లాలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యుల కోసం ఈ నెల 12వ తేదీన స్థానిక కళాభారతి లో నిర్వహించనున్న ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన 10 థీమ్‌ల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లు సిద్ధం చేయాలని, గురువారం ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించే శిక్షణలో అన్ని అంశాలు సమగ్రంగా కవర్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## యూసుఫ్‌పేటలో 10వ తరగతి విద్యార్థులకు స్టేషనరీ అందజేత





- అడ్వకేట్ సాయిబాబా గౌడ్

పాపన్నపేట, ప్రతినిధి మార్చి 10:(తెలంగాణ పత్రిక)

పాపన్నపేట మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన అడ్వకేట్ సాయిబాబా గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన పెన్నులు, పెన్సిల్లు, కవర్లు, ఎరేజర్లు, షార్ప్నర్లు, స్కేలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇటువంటి సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అడ్వకేట్ సాయిబాబా గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పశువైద్య శిబిరాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి

- దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి


దేవరుప్పుల, మార్చ్ 10 (తెలంగాణ పత్రిక):



పశువులకు వ్యాపిస్తున్న పలు రకాల వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి కోరారు. మంగళవారం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని దాని నివారణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైద్యాధికారి డాక్టర్ శిల్ప, విజయ డైరీ జనగామ జిల్లా అధ్యక్షులు కాసారపు ధర్మారెడ్డి, రైతులు నడిదే సోమిరెడ్డి, రాసాల ఐలయ్య, దుంపల బుజ్జయ్య, వార్డు సభ్యుడు గోడిశాల శ్రీనివాస్, నాయకులు, యువజన నాయకులు పత్తేపురపు శేఖర్, చిలుకూరి ఉమేష్, సందీప్, సంతోష్, సురేష్, సోమయ్య, అఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

పాపన్నపేట, ప్రతినిధి మార్చి 10:(తెలంగాణ పత్రిక)



ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలై ఒకరు మృతి చెందిన సంఘటన పాపన్న పేట గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు పాపన్నపేట గ్రామానికి చెందిన ఆరే కటికే మోహన్(53) ఏడుపాయల వద్ద మేకల కట్టింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఏడుపాయలకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు.ఏడుపాయలకు వెళ్లి ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా పాపన్నపేట శివారులోని రాగానే ఇతను ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని..

ప్రతినిధి మార్చి 10:(తెలంగాణ పత్రిక)



వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలోని 48, 49 డివిజన్‌ల పరిధిలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం సీడీఎఫ్ నిధుల నుండి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గౌడ సంఘ కులస్తులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.